బలగం TV
BALAGAM
నిజమే మా బలం.. ప్రజలే మా బలగం
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ గురువారం 12 సెప్టెంబర్ 2024 | www.balagamtv.com | పేజీలు 4

## తెలంగాణ ప్రజాపాలన దినోత్సవంగా సెప్టెంబర్ 17

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

సెప్టెంబర్ 17పై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తెలంగాణ ప్రజాపాలన దినోత్సవంగా నిర్వహించాలని నిర్ణయించింది. తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా అన్ని జిల్లాల్లో జెండాలు ఎగరవేయనున్నారు మంత్రులు, సలహాదారులు, కార్పొరేషన్ చైర్మన్లు.

హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి జెండా ఎగరవేయనున్నారు. తెలంగాణ ప్రభుత్వం నిర్ణయంతో గత కొంతకాలంగా సెప్టెంబర్ 17 నిర్వహణపై నెలకొన్న వివాదానికి తెరపడింది. గత ప్రభుత్వం సెప్టెంబర్ 17ను తెలంగాణ విలీన దినోత్సవంగా ప్రకటించింది. అటు.. కేంద్ర ప్రభుత్వం సెప్టెంబర్ 17ను తెలంగాణ విమోచన దినోత్సవంగా జరుపుకుంటోంది. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం.. సెప్టెంబర్ 17ను తెలంగాణ ప్రజాపాలన దినోత్సవంగా ప్రకటించింది..



# చెరువుల్ని ఆక్రమిస్తే చెరసాలకే..!

## చెరువులు, కుంటలు, నాలాల ఆక్రమణల వల్లే వరదలు

- ఆక్రమించుకున్న చెరువులను స్వచ్ఛందంగా వదిలేయాలి
- లేకపోతే ఎంత గొప్పవారైనా అక్రమ నిర్మాణాల కూల్చివేత తప్పదు
- స్టే తెచ్చుకుంటే కోర్టుల్లో కొట్లాడతాం.. అవసరమైతే జైలుకు పంపిస్తాం
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- ఎస్ఐల పాసింగ్ అవుట్ పరేడ్‌లో పాల్గొన్న సీఎం

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

చెరువులు, కుంటలు, నాలాల్లోని అక్రమ నిర్మాణాలను నేలమట్టం చేసి తీరుతామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఎఫ్టీఎల్, బఫర్ జోన్ల పరిధిలో నిర్మాణాలను క్రమబద్ధం చేసే ప్రసక్తే లేదన్నారు. ఆక్రమణదారులు స్వచ్ఛందంగా వైదొలగాలని పిలుపునిచ్చారు. అవసరమైన పక్షంలో ఆక్రమణ దారులను జైలుకు పంపేందుకు కూడా వెనకాడబోమని హెచ్చరించారు. రాజా బహదూర్ వెంకట్రామారెడ్డి తెలంగాణ పోలీస్ అకాడమీలో ఎస్ఐలు, ఏఎస్ఐల పాసింగ్ అవుట్ పరేడ్ కార్యక్రమంలో ముఖ్యమంత్రి గారు ప్రసంగించారు. యువత, నిరుద్యోగ సమస్య, ఉద్యోగ నియామకాలు, డ్రగ్స్ నియంత్రణ, పోలీసింగ్, హైడ్రా, రుణమాఫీ వంటి పలు కీలక అంశాలపై మాట్లాడారు.

వరదల కారణంగా పేదల జీవితాలు అతలాకుతలం అవుతున్నాయి. ఆక్రమణల కారణంగానే వరదలు వస్తున్నాయి. ఆక్రమణలను తొలగించి మూసీ నది ప్రక్షాళన చేస్తాం. పరీవాహక ప్రాంతంలోని 11 వేలకు పైగా నిర్వాసిత కుటుంబాలకు ప్రభుత్వం పునరావాసం కల్పిస్తుంది.

మనకు కాస్మెటిక్ పోలీసింగ్ కాదు. కాంక్రీట్ పోలీసింగ్ అవసరం. ఫ్రెండ్లీ పోలీసింగ్ బాధితులకు మాత్రమే, నేరస్తులకు కాదు. ఖాకీ డ్రెస్ ఉన్నది ప్రజల కోసమే అనే విశ్వాసం కల్పించేలా కొత్తగా ఉద్యోగాల్లో చేరిన ఎస్సైలు, ఏఎస్ఐలు పని చేయాలి. పోలీసుల పిల్లల కోసం హైదరాబాద్, వరంగల్‌లో ఒక్కోచోట 50 ఎకరాల్లో రెసిడెన్షియల్స్ ను రెండేళ్లలో అందుబాటులోకి తెస్తామన్నారు.

మా ప్రభుత్వం పరిశ్రమల అభివృద్ధి కోసం పెట్టుబడులు తీసుకురావడమే కాదు, రైతన్నలు, నేతన్నలు, గీతన్నలను ఆదుకుంటోంది. కేవలం 28 రోజుల్లోనే 22,22,685 రైతుల ఖాతాల్లో రూ. 18 వేల కోట్లు జమచేసి రుణమాఫీ చేశాం.తొమ్మిదేండ్లుగా నెరవేరని నిరుద్యోగ యువత ఆకాంక్షలను మా ప్రభుత్వం సాకారం చేస్తోంది. పబ్లిక్ సర్వీస్ కమిషన్ ను ప్రక్షాళన చేసి భారీ ఎత్తున ఉద్యోగ నియామకాలు చేపట్టాం. ఇప్పుడు యువకులు ఉత్సాహంతో పరీక్షలకు సిద్ధం అవుతున్నారు. తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుతున్నాం.

చెరువులు, కుంటలు, నాలాల ఆక్రమణల వల్లే వరదలు వస్తున్నాయి. వరదలతో పేదల జీవితాలు అతలాకుతలం అవుతున్నాయి. ఫాంహౌస్‌ల నుంచి వచ్చే డ్రైనేజీని గండిపేటలో కలుపుతున్నారు. అందుకే చెరబట్టిన వారి నుంచి చెరువులను విడిపిస్తున్నాం. ఆక్రమించుకున్న చెరువులను స్వచ్ఛందంగా వదిలేయాలని ఆక్రమణ దారులకు విజ్ఞప్తి చేస్తున్నా..లేకపోతే చెరువులలోని అక్రమ నిర్మాణాలను నేలమట్టం చేసి తీరుతాం. నాలాలపై ఆక్రమణలను కూడా తప్పనిసరిగా మిగితా 2వ పేజీలో

## గచ్చిబౌలిలో రేవ్ పార్టీ భగ్నం

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

నగరంలోని గచ్చిబౌలిలో నిర్వహిస్తున్న రేవ్ పార్టీని పోలీసులు భగ్నం చేశారు. గెస్ట్ హౌస్ లో ఓ సాఫ్ట్ వేర్ ఉద్యోగి గుట్టుచప్పుడు కాకుండా ఏర్పాటు చేసిన పార్టీకి సినీ పరిశ్రమలోని పలువురు వ్యక్తులు హాజరైనట్లు సమాచారం. గచ్చిబౌలి టీఎన్జీవో కాలనీలోని ఓ గెస్ట్ హౌస్‌లో జరిగిన ఈ పార్టీలో గంజాయి, ఈ సిగరెట్లు తదితర నిషేధిత పదార్థాలను విచ్చలవిడిగా వినియోగించినట్లు తెలుస్తోంది.పక్కా సమాచారంతో దాడి చేసిన మాదాపూర్ ఎస్‌వోటీ పోలీసులు.. మొత్తం 18 మంది యువతీయువకులను అదుపులోకి తీసుకున్నారు. ఇందులో ఆరుగురు యువతులు ఉన్నారని పోలీసులు తెలిపారు. వారి నుంచి 45 గ్రాముల గంజాయి ప్యాకెట్లు, ఈ సిగరెట్లు, మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామని వివరించారు. ఆపై వారిని గచ్చిబౌలి పోలీసులకు అప్పగించారు. ఈ వ్యవహారంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని పోలీసులు వివరించారు.


## క్రీడా భవనాన్ని ప్రారంభించిన సీఎం రేవంత్‌రెడ్డి

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**



తెలంగాణ పోలీస్ అకాడమీలో నూతనంగా నిర్మించిన క్రీడా భవనాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం ప్రారంభించారు.. ఈ సందర్భంగా ఆయన కొంత సేపు పోలీస్ ఉన్నతాధికారులతో షటిల్ ఆడారు.. అనంతరం ఆయన మాట్లాడుతూ, పోలీస్ యంత్రంగానికి కావాలసిన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు.. ఈ క్రీడా ప్రాంగంణంలో షటిల్, టిటి, తో జిమ్ కూడా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డిజిపి జీతేందర్ తో పాటు పలువురు ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు..

# ట్రంప్ VS కమలా హారిస్





**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

అధ్యక్ష ఎన్నికలతో అగ్రరాజ్యం అమెరికాలో రాజకీయాలు వేడెక్కాయి. డెమోక్రాట్స్, రిపబ్లికన్ పార్టీ అభ్యర్థుల మధ్య తీవ్ర పోటీ కొనసాగుతోంది. గెలుపే లక్ష్యంగా ఇద్దరు అభ్యర్థులూ వ్యూహాత్మకంగా ముందుకు వెళ్తున్నారు. ఈ నేపథ్యంలో డొనాల్డ్ ట్రంప్, కమలా హారిస్ మొదటిసారి ముఖాముఖి చర్చలో పాల్గొన్నారు. వాడీవేడిగా సాగిన ఈ డిబేట్‌లో పరస్పర విమర్శల దాడి చేసుకున్నారు. ఒకరిపై ఒకరు తీవ్ర ఆరోపణలు చేసుకున్నారు.

ఇక కమలా హారిస్‌తో డిబేట్‌పై ట్రంప్ తొలిసారి స్పందించారు. ఇది ఓ గొప్ప చర్చగా అభివర్ణించారు. ఎప్పటికీ ఇది అత్యుత్తమ చర్చల్లో ఒకటిగాభావిస్తున్నట్లు ట్రంప్ పేర్కొన్నారు. హారిస్‌తో మరో చర్చకు సిద్ధమని ప్రకటించారు. ఇదిలా ఉండగా.. కమలా హారిస్ కూడా ట్రంప్‌తో సెకెండ్ డిబేట్‌కు సిద్ధమైనట్లు ఉపాధ్యక్షురాలి ప్రచార చైర్ జెన్ ఓ మల్లే డిల్లాన్ తెలిపారు. అక్టోబర్‌లో రెండో డిబేట్ ఉంటుందని తెలిపారు.

కాగా, నవంబర్ 5న అమెరికా అధ్యక్ష పదవికి ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే. ఈ ఎన్నికల్లో రిపబ్లికన్ అభ్యర్థిగా డొనాల్డ్ ట్రంప్, డెమాక్రటిక్ అభ్యర్థిగా కమలా హారిస్ పోటీ పడుతున్నారు. గెలుపే లక్ష్యంగా ఇద్దరు అభ్యర్థులూ వ్యూహాత్మకంగా ముందుకు వెళ్తున్నారు. ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. ఇక భారత మూలాలున్న అధ్యక్ష అభ్యర్థి కమలా హారిస్ ప్రచారంలో దూసుకెళ్తున్నారు. మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు గట్టి పోటీ ఇస్తున్నారు.

ఈ క్రమంలో ఇద్దరు అధ్యక్ష అభ్యర్థుల మధ్య తొలి డిబేట్ జరిగింది. ఏబీసీ న్యూస్ నిర్వహించిన చర్చలో పాల్గొన్నారు. ఆ ఇద్దరూ అనేక అంశాలపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. అబార్షన్లు, యుద్ధాలు, ఆర్థికం, హౌజింగ్ సంక్షోభం లాంటి అంశాలపై చర్చించుకున్నారు. రిపబ్లిక్ పార్టీ అభ్యర్థి ట్రంప్, డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థి కమలా హ్యారిస్.. పోటాపోటీగా డిబేట్‌లో పాల్గొన్నారు. తొలుత ఇద్దరూ చర్చావేదికపై హ్యాండ్‌షేక్ ఇచ్చుకున్నారు. ఆ తర్వాత తమ విధానాలను వివరించారు.

అమెరికా, పెన్సిల్వేనియాలో మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, డెమొక్రటిక్ అధ్యక్ష అభ్యర్థి కమలా హారిస్ మధ్య తొలి డిబేట్ వాడి వేడిగా సాగింది. అమెరికాలోకి మళ్లీ టెర్రరిస్టులనీ, నేరస్తులనూ అనుమతించారని.. జో బిడెన్ ప్రభుత్వంపై ట్రంప్ విరుచుకుపడ్డారు. ఈ మొదటి టీవీ డిబేట్‌లో 59 ఏళ్ల కమలా హారిస్.. ట్రంప్‌ని గట్టిగానే ఎదుర్కొన్నారు. మహిళా ఓటర్ల సపోర్ట్ కాస్త ఎక్కువగా కలిగివున్న హారిస్.. సంతానం, అబార్షన్ అంశాలపై ట్రంప్‌ని గట్టిగానే సవాల్ చేశారు. అదే సమయంలో ట్రంప్.. ఆర్థిక వ్యవస్థ, ఇమ్మిగ్రేషన్ అంశాలపై హారిస్‌ని టార్గెట్ చేశారు.

## కోర్టు ఆదేశాలను అమలు చేయండి..

- అసెంబ్లీ సెక్రటరీకి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వినతి

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**



పార్టీ మారిన ఎమ్మెల్యేల విషయంలో హైకోర్టు ఇటీవల ఇచ్చిన ఆదేశాలపై బీఆర్ఎస్ యాక్షన్ మొదలుపెట్టింది. కోర్టు ఆదేశాలు అమలు చేయాలని కోరేందుకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఇవాళ అసెంబ్లీ స్పీకర్ కార్యాలయానికి వెళ్లారు. ఈ మేరకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, కె.పి.వివేకానంద అసెంబ్లీ సెక్రటరీకి వినతి పత్రాన్ని అందజేశారు. బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరిన ముగ్గురు ఎమ్మెల్యేలపై నెలరోజుల్లో చర్యలు తీసుకోవాలని, లేదంటే తామే సుమోటోగా కేసు మళ్లీ విచారిస్తామని హైకోర్టు ఇటీవల స్పీకర్‌కు సూచించిన విషయం తెలిసిందే. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై విచారణ షెడ్యూల్‌ను తేదీల వారీగా ప్రొసీడింగ్స్ విడుదల చేయాలని హైకోర్టు అసెంబ్లీ సెక్రటరీని ఆదేశించింది.

## హైడ్రా పేరుతో ముఖ్యమంత్రి హైడ్రామా



- బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు

**బలగం టీవి, హైదరాబాద్**

హైడ్రా పేరుతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హైడ్రామా చేస్తున్నారని, హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను చంపేశారని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. ప్రభుత్వం తీరుపై ఆయన తీవ్రంగా మండిపడ్డారు. కాంగ్రెస్ పాలనలో హైదరాబాద్ ప్రతిష్ఠ మసకబారిందన్నారు. రేవంత్‌రెడ్డి తీరుతో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కనీసం గ్రామాల్లో తిరగలేని పరిస్థితి దాపురించిందని ఎద్దేవా చేశారు. కేంద్రం నుంచి వచ్చిన ఉపాధి హామీ పథకం నిధులు రూ.800 కోట్లు సైతం కాంగ్రెస్ ప్రభుత్వం దారి మళ్లించిందని తీవ్రంగా ఆరోపించారు. తొమ్మిది నెలల పాలనలోనే 2 నెలల పింఛన్లు మింగేశారని ధ్వజమెత్తారు. పారిశుద్ధ్య నిర్వహణ పడకేయడంతో వ్యాధులు పెరిగాయని, ఫార్మాసిటీ, మెట్రో రైలు విషయంలో రూటు మార్చారని దుయ్యబట్టారు. రాష్ట్రంలో 50శాతానికి మించి రైతు రుణమాఫీ కాలేదన్న హరీశ్‌రావు, కేవలం 21 లక్షల మంది రైతులకు మాత్రమే అయినట్లు వివరించారు. రైతులకు 100 శాతం రుణమాఫీ అయ్యేదాకా, పంట బీమా, భరోసా కల్పించకపోతే రానున్న కాలంలో బీఆర్ఎస్ పార్టీ ఆందోళనలు చేపడుతుందని హెచ్చరించారు.

10 నెలల కాంగ్రెస్ పాలనలో గ్రామపంచాయతీకి నిధులు విడుదల అవ్వట్లేదని, సర్పంచులను కదిలిస్తే కన్నీళ్లు బయటకు వస్తున్నాయని తెలిపారు. గత ప్రభుత్వం హయాంలో ప్రతినెలా పల్లె ప్రగతికి నిధులు వచ్చాయని, ఇప్పుడేమో నిధులు కరవయ్యాయని ఆక్షేపించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం పట్టణాలను గ్రామాలను గాలికి వదిలేసి, హైడ్రా పేరిట డ్రామాలు చేస్తుందని విమర్శించారు. ప్రభుత్వ తప్పిదాలను ఎత్తిచూపిస్తున్న యూట్యూబ్?లు చూస్తే రేవంత్ రెడ్డికి వెన్నుల్లో వణుకు పుడుతొందని హరీశ్‌రావు వ్యాఖ్యానించారు.

## హైడ్రా @262 ఆక్రమణలు కూల్చివేత

- 111 ఎకరాలు భూమి స్వాధీనం

**బలగం టీవి, హైదరాబాద్**

జీహెచ్ఎంసీ పరిధిలో మొత్తం 23 ప్రాంతాల్లో 262 అక్రమ నిర్మాణాలను కూల్చివేసి 111.72 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకున్నట్లు ప్రభుత్వానికి హైడ్రా నివేదిక సమర్పించింది. రెండు నెలలుగా చెరువులు, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తోంది. ఈ క్రమంలోనే రామ్‌నగర్ మణెమ్మ గల్లీలో 3, గగన్ పహాడ్ అప్పా చెరువులో 14, అమీన్‌పూర్ పెద్ద చెరువు పరిధిలో 24, మాదాపూర్ సున్నం చెరువులో 42, దుండిగల్ కత్వా చెరువు పరిధిలో 13 అక్రమ నిర్మాణాలను తొలగించినట్లు హైడ్రా వెల్లడించింది.

అత్యధికంగా అమీన్‌పూర్‌లో 51 ఎకరాలు, మాదాపూర్ సున్నం చెరువు పరిధిలో 10 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొంది. హైడ్రాకు ఐపీఎస్ అధికారి రంగనాథ్ కమిషనర్‌గా వ్యవహరిస్తున్న నేపథ్యంలో దీనికి ప్రత్యేక పోలీసు సిబ్బందిని కేటాయిస్తూ డీజీపీ కార్యాలయం ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేసింది. 15 మంది సీఐ స్థాయి, 8 మంది ఎస్ఐ స్థాయి పోలీసు అధికారులు ఆక్రమణల కూల్చివేత కోసం పనిచేయనున్నారు.



## బీఆర్ఎస్, కాంగ్రెస్ మాటల యుద్ధం

- పార్టీ మారిన ఎమ్మెల్యేలకు చీర గాజులు పంపిస్తామన్న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి
- కౌంటర్ ఇచ్చిన కాంగ్రెస్ మహిళా నేతలు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణలో అధికార కాంగ్రెస్ పార్టీ, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ మధ్య తీవ్ర మాటల యుద్ధం చోటు చేసుకుంటోంది. ముందుగా ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిలపై.. హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తీవ్ర వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. అంతటితో ఆగకుండా పార్టీ మారిన ఎమ్మెల్యేలకు చీర, గాజులు పంపిస్తామని.. ఏకంగా మీడియా సమావేశంలోనే చీర, గాజులను చూపించారు. దీంతో కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా మండిపడింది. ఈ నేపథ్యంలోనే మీడియా సమావేశం ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ మహిళా నేతలు పాడి కౌశిక్ రెడ్డి తీరుపై తీవ్రంగా విరుచుకుపడ్డారు. ఈ క్రమంలోనే పాడి కౌశిక్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన మహిళా ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్ పర్సన్ బండ్రు శోభారాణి.. తెలంగాణ మహిళలకు పోరాట స్ఫూర్తి ఉందని పేర్కొన్నారు.

భార్య, బిడ్డలను అడ్డుపెట్టుకొని హుజూరాబాద్‌లో ఎమ్మెల్యేగా గెలిచిన పాడి కౌశిక్ రెడ్డి.. చీర, గాజులు పంపాలనుకుంటే మొదట కేసీఆర్, కేటీఆర్‌లకే పంపాలని కౌంటర్ ఇచ్చారు. బీఆర్ఎస్ పుట్టిందే ఇతర పార్టీ నాయకుల చేరికతో అని గుర్తు చేశారు. ఇక కేసీఆర్ రాజకీయ పుట్టుక ఎక్కడ ఉందో చూసుకో అంటూ కౌశిక్ రెడ్డికి సమాధానం ఇచ్చారు. ఈ సందర్భంగా లైవ్ లో చెప్పును చూపిస్తూ వార్నింగ్ ఇచ్చారు. రాజకీయాల్లో మహిళలను అవమానించేలా మిగితా 2వ పేజీలో

## రాష్ట్రంలో కేంద్ర బృందం పర్యటన

**బలగం టీవి, హైదరాబాద్**

రాష్ట్రంలో భారీ వర్షాలు, వరదలతో తీవ్రంగా నష్టపోయి ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తున్న బాధితుల్లో భరోసా నింపడమే లక్ష్యంగా ఖమ్మం జిల్లాలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో కేంద్ర విపత్తు నిర్వహణ బృందాలు పర్యటించాయి. మొత్తం ఆరుగు సభ్యులు రెండు బృందాలుగా విడిపోయి, ఖమ్మం జిల్లాలోని కూసుమంచి, ఖమ్మం గ్రామీణం, తిరుమలాయపాలెం మండలాల్లో తొలిరోజు క్షేత్రస్థాయిలో పర్యటించి బాధితులు, రైతుల కష్టాలు అడిగి తెలుసుకున్నారు.

నేషనల్ డిజాస్టర్ మేనేజ్ మెంట్ అథారిటీ సలహాదారు, కేంద్ర హోంశాఖ జాయింట్ డైరెక్టర్ కల్నల్ కీర్తి ప్రతాప్ సింగ్, ఆర్థిక శాఖ డిప్యూటీ డైరెక్టర్ మహేశ్ కుమార్, వ్యవసాయశాఖ నుంచి శాంతినాథ్ శివప్ప ఒక బృందంగా పర్యటించారు. రెండో బృందంలో రోడ్లు భవనాల శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ ఎస్ కే కుశ్వంగ, గ్రామీణాభివృద్ధి శాఖ నుంచి టి నైల్ ఖాన్సూన్, ఎన్ఆర్ఎస్‌సీ నుంచి శశివర్ధన్ రెడ్డి మరో బృందంగా క్షేత్ర స్థాయిలో పర్యటించారు. తొలుత కూసుమంచి మండలం భగత్ వీడుకు చేరుకున్నారు. దెబ్బతిన్న పంటలను పరిశీలించారు.

కోతకు గురైన పొలాలు, ఇసుక మేటలు వేసిన పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు.ఈ సందర్భంగా రైతులు పంట నష్టంపై అన్నదాతలు తమకు జరిగిన నష్టాన్ని బృంద సభ్యులకు వివరించారు. జాతీయ రహదారిపైనే పాలేరు నియోజకవర్గంలో జరిగిన వరద నష్టంపై ఏర్పాటు చేసిన ఫొటో ప్రదర్శనను తిలకించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, వ్యవసాయ ఉద్యాన అధికారులు నష్టం వివరాలను కేంద్ర బృందానికి విన్నవించారు. రెండో బృందం మల్లాయిగూడెం పంచాయతీలో వరదల ధాటికి కొట్టుకుపోయిన పంచాయతీరాజ్ రహదారిని మిగితా 2వ పేజీలో

## మార్చిలోపు 4వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకోవాలి

- ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**


2025 మార్చి 31 నాటికి ఐదు యూనిట్లు అందుబాటులోకి తీసుకువచ్చి 4,000 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగానే యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ ప్రాజెక్టు సకాలంలో పూర్తి కాలేదన్నారు. ప్రాజెక్టుపై నిత్యం సమీక్షలు జరపకుండా పక్కన పెట్టడం వల్లే వ్యయం మరింత పెరిగి ప్రభుత్వంపైన ఆర్థిక భారం పడిందన్నారు. ప్రాజెక్టు పనులు పూర్తి చేయడానికి వారం వారం క్యాలెండర్ ఖరారు చేశామన్నారు.

నల్గొండ జిల్లా దామరచర్ల మండలం వీర్లపాలెంలోని యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం (వైటీపీఎస్) అభివృద్ధి, పనుల పురోగతిని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పరిశీలించారు. అనంతరం యూనిట్ -2 ఆయిల్ సింక్రనైజేషన్‌ను స్విచ్ ఆన్ చేసి పనులను ప్రారంభించారు. పనులు వేగంగా జరుగుతున్నాయని అధికారులు, సిబ్బంది, కార్మికులకు ప్రభుత్వం తరపున అభినందనలు తెలిపారు. అనంతరం ప్రాజెక్టు పనుల పురోగతిపై టీజీజెన్‌కో, బీహెచ్ఈఎల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ ఏడాది డిసెంబర్ చివరి నాటికి 3 యూనిట్ల ద్వారా 2,400 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తిని అందుబాటులోకి తీసుకొస్తామని డిప్యూటీ సీఎం భట్టి అన్నారు. 2025 మార్చి నాటికి 5 యూనిట్ల ద్వారా 4 వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తియే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. పనులు వేగవంతం చేయడానికి సివిల్ పనులతో పాటు, రైల్వే పనులు, రోడ్డు రవాణా మార్గాన్ని సులభతరం చేస్తున్నామన్నారు.

ప్రాజెక్టులో నిరుద్యోగులకు ఉద్యోగాలు : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎన్జీటీ క్లియరెన్స్‌తో పాటు, నిరంతరం ప్రాజెక్టు పనులపై పర్యవేక్షణ చేయడం జరుగుతుందన్నారు. ప్రాజెక్టు పూర్తయితే రాష్ట్ర స్థూల ఉత్పత్తి పెరుగుతుందన్నారు. భూ నిర్వాసితులకు భూసేకరణ నిధులతో పాటు, ప్రాజెక్టులో తప్పనిసరిగా ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. యాదాద్రి పవర్ ప్లాంట్‌తో పాటు పులిచింతల ప్రాజెక్టులో భూములు కోల్పోయిన వారిని అన్ని విధాల ఆదుకుంటామని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. బాధిత కుటుంబాలలోని నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఆదేశించిన ఉప ముఖ్యమంత్రికి ప్రజలు ధన్యవాదాలు తెలిపారు.

యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ నిర్మాణం ఆలస్యమైనప్పటికీ త్వరితగతిన పూర్తి మిగితా 2వ పేజీలో



వరద బాధితుల సహాయార్థం తెలంగాణ ముఖ్యమంత్రి సహాయ నిధికి ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ 1కోటి రూపాయలు విరాళం అందించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఈ మేరకు విరాళం చెక్కును అందజేశారు. సహాయ కార్యక్రమాల్లో ప్రభుత్వానికి అండగా నిలిచి ఔదార్యం చాటుకున్న వారికి ముఖ్యమంత్రి కృతజ్ఞతలు తెలిపారు. బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

# గాలిలో దీపంలా విద్యా వ్యవస్థ

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

: కాంగ్రెస్ పాలనలో విద్యా వ్యవస్థ గాలిలో దీపంలా మారిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. తక్షణమే విద్యాశాఖపై ఉన్నతస్థాయి సమీక్షి నిర్వహించి సమస్యలు పరిష్కరించాలని ఎక్స్ వేదికగా బుధవారం డిమాండ్ చేశారు. విద్యా సంవత్సరం ప్రారంభమై నెలలు గడుస్తున్నా ప్రభుత్వం గ్రాంట్లు విడుదల చేయకపోవటం సిగ్గుచేటని విమర్శించారు. సీఎం సొంత నియోజకవర్గంలోనే టీచర్లు లేక విద్యార్థులు టీసీలు తీసుకొని పోతున్నారని ఉదహరించారు. రుణమాఫీ కాని రైతులపై దరఖాస్తుల పేరుతో దోపిడీ మొదలైందని పేర్కొన్నారు. రైతుల నుంచి వసూలు చేసిన సొమ్ముతో రుణమాఫీ అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తున్నదా? అని ప్రశ్నించారు.

బీఆర్ఎస్ హయాంలో అమలైన 'సీ ఎం బ్రేక్ ఫాస్ సీమ్'ను అర్థాంతరంగా ఆపడం దుర్మార్గమని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. పథకంపై కేంద్రాన్ని దేబిరించటం హాస్యాస్పదంగా ఉన్నదని ఎద్దేవాచేశా రు. ఈ పథకం ఊపిరి తీసి ప్ర భుత్వం లక్షలాది మంది విద్యార్థుల పొట్టగొట్టిందని మండిపడ్డారు. ప్రభుత్వ దవాఖానలు రోగులతో కికిరిసిపోవడం దిగజారిన ప్రజారోగ్య వ్యవస్థకు, ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని కేటీఆర్ విమర్శించారు. డాక్టర్ల కొరత, మందుల లేమితో కొట్టుమిట్టాడుతున్న దవాఖానల్లో పరిస్థితులను చకదిద్దాలని చెప్పారు. సుడిగాలి (టోర్నడో) బీభత్సానికి ములుగు జిల్లా మేడారం–తాడ్వాయి అటవీ ప్రాంతంలో సుమారు 200 హెక్టార్ల మేర లక్షకు పైగా చెట్లు నేలకూలడం అత్యంత బాధాకరమని కేటీఆర్ పేర్కొన్నారు. నష్టపోయిన గిరిజనులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

**కాంగ్రెస్ ఖర్చు చేసింది వాల్మీకి స్కామ్ సొమ్మే**

కర్ణాటక వాల్మీకి స్కామ్ సొమ్మునే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఖర్చు చేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. వాల్మీకి స్కామ్‌పై తాము మొదటి నుంచి చెప్తున్నదే ఇప్పుడు నిజమని తేలిందన్నారు. గిరిజనుల బాగు కోసం ఖర్చు చేయాల్సిన సొమ్మును ఎన్నికల ప్రచారం కోసం వాడుకున్న కాంగ్రెస్ పార్టీ నేతలను శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. వాల్మీకి కుంభకోణంలో కాంగ్రెస్ నేత, కర్ణాటక మాజీ మంత్రి బీ నాగేంద్రనే కీలక సూత్రధారి అని ఈడీ తన చార్జిషీట్‌లో నిర్ధారించిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా ఉటంకించారు. కర్ణాటక మహర్షి వాల్మీకి షెడ్యూల్డ్ ట్రైబ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్‌కు చెందిన రూ.187 కోట్లు అప్పటి కాంగ్రెస్ మంత్రి చేతులమీదుగా దారిమళ్లాయని పేర్కొన్నారు.

ఆ స్కామ్‌లో ప్రధాన నిందితుడు సత్యనారాయణ వర్మ తెలంగాణకు చెందిన ఇద్దరు కీలక కాంగ్రెస్ నేతలకు అత్యంత సన్నిహితుడని ఆరోపించారు. సత్యనారాయణ వర్మ వ్యాపారంలోనూ కాంగ్రెస్ నేతలు భాగస్వాములుగా ఉన్నట్టు అనుమానాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ కుంభకోణంలో ఇంకా అనేక మంది కాంగ్రెస్ పార్టీకి చెందిన పెద్దలు ఉన్నారనేది ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదని అన్నారు. ఈ కుంభకోణంపై దర్యాప్తు సంస్థలు లోతుగా విచారించి నిజానిజాలను నిగ్గుతేల్చాలని, దోషులను కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు.

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కథువా అత్యాచారం కేసులో నిందితులకు మద్దతుగా నిలిచిన లాల్‌సింగ్ అనే వ్యక్తికి కాంగ్రెస్ అసెంబ్లీ టికెట్ ప్రకటించటం సిగ్గుచేటని కేటీఆర్ మండిపడ్డారు. నారీ న్యాయ్ అంటూ గొప్పలు చెప్పుకునే కాంగ్రెస్ పార్టీ రేపిస్టులను సమర్థించిన వ్యక్తికి సీటు ఎలా కేటాయిస్తుందని ప్రశ్నించారు. కథువా అత్యాచారాన్ని సమర్థించిన వ్యక్తికి సీటు కేటాయించి, అదే ఘటనలో బాధితుల తరపున పోరాడుతున్నట్టు కాంగ్రెస్ ఎలా చెప్పుకుంటుందని నిలదీశారు.

## కమలా హారిస్ నిజమైన దేశాధ్యక్ష అభ్యర్థి : కేటీఆర్

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

అధ్యక్ష ఎన్నికలతో అగ్రరాజ్యం అమెరికాలో రాజకీయాలు వేడెక్కాయి. డెమోక్రాట్స్, రిపబ్లికన్ పార్టీ అభ్యర్థుల మధ్య తీవ్ర పోటీ కొనసాగుతోంది. గెలుపే లక్ష్యంగా ఇద్దరు అభ్యర్థులూ వ్యూహాత్మకంగా ముందుకు వెళ్తున్నారు. ఈ నేపథ్యంలో డొనాల్డ్ ట్రంప్, కమలా హారిస్ మొదటిసారి ముఖాముఖి చర్చలో పాల్గొన్నారు. ట్రంప్‌తో జరిగిన ఈ డిబేట్‌లో కమలా దూకుడు ప్రదర్శించారు. ట్రంప్ విధానాలను ఎండగట్టారు. ఈ చర్చలో ట్రంప్‌పై కమలా చేసిన ఎదురుదాడిని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశంసించారు. కమలా హారిస్ నిజమైన దేశాధ్యక్ష అభ్యర్థి అంటూ కొనియాడారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. 'కమలా హారిస్ నిజమైన దేశాధ్యక్ష అభ్యర్థి అనిపించింది.. ఈ ఏడాది చివర్లో అమెరికాకు ఆమె తొలి మహిళా అధ్యక్షురాలు అయ్యే అవకాశాలు ఉన్నాయి' అని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం కేటీఆర్ ట్వీట్ వైరల్‌గా మారింది.

### మార్చిలోపు

## 4 వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకోవాలి

(మొదటి పేజీ తరువాయి)

చేయడానికి తమ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించదని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. భూములు ఇచ్చిన వారికి జాబితా రూపొందించి వారికి న్యాయం చేస్తామన్నారు. 2025 మార్చి నాటికి ఐదు యూనిట్లు అందుబాటులోకి తీసుకువచ్చి 4,000 మెగావాట్ల విద్యుత్?ను ఉత్పత్తి చేస్తామని మంత్రులు స్పష్టం చేశారు.

## రాష్ట్రంలో కేంద్ర బృందం పర్యటన

(మొదటి పేజీ తరువాయి)

పరిశీలించింది. పాలేరు జలాశయం వద్ద గండి పడిన సాగర్ ఎడమ కాల్వను పరిశీలించారు. జలవనరుల శాఖ సీఈ విద్యాసాగర్ జిల్లాలో సాగునీటి రంగానికి జరిగిన నష్టంపై కేంద్ర బృందానికి వివరించారు. తర్వాత ఎర్రగడ్డ తండాకుచేరుకుని భారీ వర్షాలకు నీట మునిగిగిన భక్త రామదాసు ఎత్తిపోతల పథకం పంపౌ హౌజ్?ను పరిశీలించారు. నీట మునిగిన మోటార్లు, ప్యానెల్ బోర్డులను పరిశీలించారు.

కూసుమంచి మండలంలో పర్యటించిన కేంద్ర బృందం : కూసుమంచి మండల పర్యటన తర్వాత ఖమ్మం గ్రామీణంలోని గూడూరుపాడు తనకంపాడు గ్రామాల పరిధిలో ఆకేరు వరదకు కొట్టుకుపోయిన పంట పొలాలు, కోతకు గురై భారీగా ఇసుక మేటలు వేసిన వ్యవసాయ భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో నష్టపోయిన పంట వివరాలు అడిగి తెలుసుకున్నారు. రెండు గ్రామాల రైతులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్థానిక రైతులను ఏయే పంటలు సాగు చేస్తున్నారని వివరాలు అడిగారు. పంటలసాకుగు ఎంత ఖర్చయింది అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రెండు గ్రామాలకు చెందిన కొంతమంది రైతులు, భారీ వర్షాలు వరదలు మిగిల్చిన నష్టాలపై వివరించి తమ గోడువెళ్లబోసుకున్నారు. అనంతరం పంట నష్టానికి సంబంధించి అధికారులు ఏర్పాటు చేసిన ఫొటో ప్రదర్శనను కేంద్రం బృందం తిలకించింది. కస్నా తండాలో భారీ వర్షాలు, వరదలకు దెబ్బతిన్న, నీట మునిగిన ఇళ్లను కేంద్ర బృందం పరిశీలించింది.

రెండో రోజూ జిల్లాలో కొనసాగనున్న కేంద్ర బృందాల పర్యటన : బాధితులతో మాట్లాడి వరద మిగిల్చిన నష్టాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. తిరుమలాయపాలెం మండలం రాకాసితండాలో పర్యటించారు. తండాలో ఇళ్లను పరిశీలించారు. తండా వాసులతో మాట్లాడారు. ఈ సందర్భంగా రైతులు,వరద బాధితులు మనోధైర్యం కోల్పోవద్దంటూ కేంద్రం బృందం సభ్యులు భరోసా ఇచ్చారు. కేంద్ర బృందాలతోపాటు రాష్ట్ర ప్రభుత్వం తరపున విపత్తు నిర్వహణశాఖ ప్రత్యేక కార్యదర్శి అరవింద్ కుమార్, గనుల శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. రెండోరోజు పర్యటనలో భాగంగా ఖమ్మం నగరంలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో కేంద్ర బృందాలు పర్యటించనున్నాయి.

## గోదావరి వరదలపై అప్రమత్తంగా ఉండండి



- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

బలగం టీవీ, భద్రాచలం

భద్రాచలం వద్ద గోదావరి నదికి రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బుధవారం ఇక్కడి వరద ఉధృతిని పరిశీలించారు. విస్తా కాంప్లెక్స్ వద్ద మురుగునీరు బయటకు తోడే ప్రక్రియ, గోదావరి కరకట్ట వద్ద వరద ఉధృతి, కొత్త కరకట్ట నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో నీటి పారుదల, పంచాయతీ, ఆర్అండ్‌బీ, అగ్రికల్చర్, విద్యుత్, వైద్య శాఖల అధికారులతో సమీక్షించారు. వరదల కారణంగా ఎదురయ్యే సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కూలిపోయిన విద్యుత్ స్తంభాలు, దెబ్బతిన్న రహదారులకు వెంటనే మరమ్మతులు చేయాలని ఆదేశించారు. గోదావరిలో నీటి ప్రవాహం 50 అడుగులు దాటి ప్రవహిస్తున్నందున ఎప్పటికప్పుడు వరద ఉధృతిపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు.

అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, గోదావరి నీటిమట్టం ఎంత పెరిగిన భద్రాచలం పట్టణంలో చుక్క నీరు రాకుండా చర్యలు చేపట్టామని అన్నారు. భద్రాద్రి పుణ్యక్షేత్రాన్ని దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలం పట్టణాన్ని సర్వాంగ సుందరంగా పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలని అన్ని ప్రభుత్వ శాఖలకు ఆదేశాలు జారీ చేశామన్నారు. ఈ భద్రాద్రి నాది.. నా సొంతం అని ప్రతి ఒక్క పౌరుడు, ప్రతి అధికారి బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. ఇక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా చర్యలు చేపట్టాలని పోలీస్ శాఖకి ఆదేశించారు.. జిల్లా మొత్తం తుఫాను వరదల ప్రభావంగా జరిగిన నష్టాన్ని పూర్తిస్థాయిలో అంచనా వేసి.. బాధితులకు వెంటనే డబ్బులు అందే విధంగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ కి మంత్రి సూచనలు చేశారు. రాముడు కరుణిస్తే ప్రతి ఒక్కరికి అవకాశం వస్తుందని.. రాజకీయపరంగా అధికారం పరంగా వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని రాములవారికి సేవ చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఇక, ఈ తుఫాను వరదల కారణంగా ఎటువంటి ప్రమాదం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టిన జిల్లా యంత్రాంగాలకి తుమ్మల అభినందనలు తెలిపారు. గతంలో మన జిల్లాలో ఉమ్మడి జిల్లాలో కలెక్టర్లుగా పని చేసిన అనేక మంది ఐఏఎస్ అధికారులు ఇప్పుడు కేంద్రస్థాయిలో ఉన్నత స్థాయిలో పని చేస్తున్నారు అని గుర్తు చేశారు. ఉన్నత స్థానంలో ఉన్న ఐఏఎస్ అధికారులు అందరూ భద్రాచలంపై ప్రేమను చూపిస్తున్నారని,.. ఇప్పటికీ తనకు ఫోన్ చేసి సార్ మన భద్రాద్రి, ఎలా ఉంది అని అడుగుతున్నారని వివరించారు.

అలాగే పత్తి కొనుగోలు కేంద్రాల ఏర్పాటు మరియు తీసుకోవలసిన చర్యలపై అధికారులతో మంత్రి తుమ్మల సమావేశం నిర్వహించారు. పత్తి కొనుగోలు కేంద్రాలు మరియు జిన్నింగ్ మిల్లులను సీజన్ ప్రారంభానికి ముందే సిద్ధం చేసుకోవాలని మంత్రి తుమ్మల అన్నారు. రైతులకు కనిష్ట మద్దతు ధర, పత్తి సేకరణ మార్గదర్శకాల గురించి ప్రచార మాధ్యమాల ద్వారా పబ్లిసిటీ ఇవ్వాలన్నారు. కొనుగోలు కేంద్రాలు వారానికి ఆరు రోజులు పనిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

## నల్లగొండలో జర్నలిస్టుల అక్రమ భూమి రిజిస్ట్రేషన్ లు రద్దు

బలగం టీవీ, హైదరాబాద్

నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఎనిమిది మంది జర్నలిస్టులు జీవో నెంబర్ 59 లోని లొసుగులను ఆసరా చేసుకొని ఇరిగేషన్ శాఖకు చెందిన సుమారు రూ.10 కోట్ల విలువ చేసే భూమిని గత ఏడాది అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఈ అంశంపై జర్నలిస్టు సంఘాలు అదనపు కలెక్టర్ స్పందించారు. జర్నలిస్టుల అక్రమ రిజిస్ట్రేషన్ లను రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. జీవో నెంబర్ 59 ప్రకారం జర్నలిస్టులు నకిలీ పత్రాలను సృష్టించి గత ఏడాది జూలై 28న నలగొండ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఇరిగేషన్ ల్యాండ్ ను రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. దీనిపై జర్నలిస్టు సంఘాలు ఆందోళన చేయడంతో అప్పటి కలెక్టర్ ఆర్ వి కర్ణన్ స్పందించి అదనపు కలెక్టర్ శ్రీనివాసును విచారణ అధికారిగా నియమించారు.జరిగిన అక్రమాలపై పూర్తిస్థాయిలో విచారణ జరిపిన అదనపు కలెక్టర్ జర్నలిస్టులు అక్రమంగా ప్రభుత్వ భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని, వీటిని రద్దు చేయాలని సీసీఎల్ఏకు నివేదిక ఇచ్చారు. ఈ మేరకు సీసీఎల్ఏ ఈ రిజిస్ట్రేషన్ లను రద్దు చేసేందుకు నిర్ణయించింది. సీసీఎల్ఏ ఆదేశాల మేరకు అదనపు కలెక్టర్ శ్రీనివాస్ 8 మంది జర్నలిస్టులు చేసుకున్న 2232 గజాల భూమి రిజిస్ట్రేషన్ లను రద్దు చేస్తూ గత నెల 14న ఉత్తర్వులు జారీ చేశారు. కొన్ని కారణాలవల్ల ఈ ఉత్తర్వులను అధికారులు బహిర్గతం చేయలేదు. అధికారుల అలసత్వం పై జర్నలిస్టు సంఘాలు గత రెండు రోజుల నుంచి ఆందోళన జరుపుతున్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం బుధవారం ఉత్తర్వుల కాపీని బహిర్గతం చేసింది.





వరద బాధితుల సహాయార్థం పోలీసు శాఖ ఒక రోజు వేతనం 11,06,83,571 రూపాయలు ముఖ్యమంత్రి సహాయ నిధికి విరాళంగా అందజేశారు. పోలీస్ అకాడమీలో జరిగిన ఎస్ఐలు, ఏఎస్ఐల పాసింగ్ అవుట్ పరేడ్ కార్యక్రమంలో ఈ మొత్తానికి సంబంధించి చెక్కును హెూం సెక్రెటరీ రవి గుప్తా గారు, డీజీపీ జితేందర్ , ఇంటెలిజెన్స్ చీఫ్ బి. శివధర్ రెడ్డి గారు, పోలీసు అధికారుల సంఘం ప్రతినిధులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అందించారు. వరద బాధితులను ఆదుకోవడానికి మంచి ఆశయంతో ముందుకొచ్చి సహాయాన్ని అందించిన పోలీసు శాఖకు ఈ సందర్భంగా సీఎం అభినందనలు తెలియజేశారు. బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

# చెరువుల్ని ఆక్రమిస్తే చెరసాలకే..!



(మొదటి పేజీ తరువాయి)

కూల్చేస్తాం. కూల్చివేతలపై స్టే తెచ్చుకుంటే కోర్టుల్లో కొట్లాడతాం. అవసరమైతే ఆక్రమణదారులను జైలుకు పంపేందుకూ వెనకాడం..'అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. చెరువులు, నాలాల ఆక్రమణలు తొలగించే లక్ష్యంతోనే హైడ్రాను ఏర్పాటు చేశామని, ఆక్రమణదారులు ఎంత గొప్పవారైనా చర్యలు తప్పవని చెప్పారు. ఇదే తమ ప్రభుత్వ విధానమని పేర్కొన్నారు. చెరువుల ఎఫ్టీఎల్, బఫర్ జోన్ల పరిధిలో నిర్మాణాలను క్రమబద్ధం చేసే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు.

రాజా బహదూర్ వెంకటరామారెడ్డి తెలంగాణ పోలీస్ అకాడమీలో బుధవారం నిర్వహించిన ఎస్ఐల దీక్షాంత్ పరేడ్‌లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. 145 మంది మహిళలు సహా 547 మంది సివిల్ ఎస్ఐలు, రిజర్వ్ ఎస్ఐలు, ఏఎస్ఐల నుంచి గౌరవ వందనాన్ని స్వీకరించారు. శిక్షణలో భాగంగా ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి ట్రోఫీలను బహూకరించారు. పాసింగ్ అవుట్ పరేడ్ కమాండర్‌గా వ్యవహరించిన పల్లి భాగ్యశ్రీని ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం ముఖ్యమంత్రి ప్రసంగించారు.

'పోలీస్ ఉద్యోగాన్ని కేవలం ఉద్యోగ బాధ్యతగా మాత్రమే కాదు.. రాష్ట్ర ప్రజలను కాపాడే ఉద్యోగంగా, భావోద్వేగంతో చూడాలి. ప్రకృతి విపత్తులైనా, శాంతిభద్రతల సమస్యలైనా, ఏ ఇతర సమస్య వచ్చినా ముందుగా అందుబాటులో ఉండేది పోలీసులే. ఆ మేరకు ప్రజల్లో విశ్వాసాన్ని, పోలీసులపై గౌరవాన్ని పెంచేలా పనిచేయాలి. రాష్ట్రంలో డ్రగ్స్, గంజాయిపై ఉక్కు పాదం మోపాలి. సైబర్ నేరాలకు తావులేకుండా యువ పోలీస్ అధికారులు పనిచేయాలి. డ్రగ్స్, గంజాయి పేరు వింటేనే వెన్నులో వణుకు పుట్టాలి. ఆక్రమణల కూల్చివేతలు, డ్రగ్స్ కట్టడి సహా ప్రభుత్వ అన్ని నిర్ణయాలను అమలు చేయాల్సిన బాధ్యత యువ అధికారులపై ఉంది. కాస్మొటిక్ పోలీసింగ్ కాదు.. కాంక్రీట్ పోలీసింగ్ అవసరం. ఫ్రెండ్లీ పోలీసింగ్ అనేది బాధితులతోనే.. నేరస్తులతో కాదు. మీ అందరినీ చూస్తోంటే తెలంగాణ డ్రగ్స్ రహితంగా మారుతుందన్న విశ్వాసం కలుగుతోంది..'అని సీఎం అన్నారు.

'సైనిక్ స్కూళ్ల మాదిరిగా హైదరాబాద్, వరంగల్‌లో ఒక్కొక్కటి 50 ఎకరాలతో రెండు రెసిడెన్షియల్ పోలీస్ స్కూళ్లు ఏర్పాటు చేస్తాం. హెూంగార్డు నుంచి డీజీపీ పిల్లల వరకు ఉచితంగా చదువుకునే ఏర్పాటు చేస్తాం. ఇందుకు సంబంధించి డీజీపీ జితేందర్, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి చర్యలు తీసుకోవాలి..'అని ముఖ్యమంత్రి ఆదేశించారు.

'కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టుబడులు తీసుకురావడమే కాదు.. రైతన్నలు, నేతన్నలు, గీతన్నలను ఆదుకుంటోంది. కేవలం 28 రోజుల్లోనే 22.22 లక్షల రైతుల ఖాతాల్లో రూ.18 వేల కోట్లు వేసి రుణమాఫీ చేశాం. తెలంగాణ వచ్చినా గత తొమ్మిదేళ్లలో నిరుద్యోగుల ఆకాంక్షలు నెరవేరలేదు. గతంలో జిరాక్స్ సెంటర్లలో టీజీపీఎస్సీ ప్రశ్నపత్రాలు లభించే దారుణ పరిస్థితి ఉండేది. మా ప్రజా ప్రభుత్వంలో నిర్వహిస్తున్న ఉద్యోగ పరీక్షలపై నిరుద్యోగులకు ఎలాంటి అనుమానాలు లేవు.

కాగా పోలీస్ అకాడమీలో శిక్షణ సంబంధిత వివరాలను పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్ ఈ సందర్భంగా వివరించారు. కార్యక్రమంలో ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, హెూంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవిగుప్తా, ఇంటెలిజెన్స్ డీజీ శివధర్‌రెడ్డి, హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, ఇతర సీనియర్ అధికారులు, యువ ఎస్ఐల కుటుంబసభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

'హైదరాబాద్ నుంచి వచ్చే కాలుష్యంతో నల్లగొండ రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మంత్రి కోమటిరెడ్డి నా దృష్టికి తెచ్చారు. ఆక్రమణలు తొలగించి మూసీని ప్రక్షాళన చేస్తాం. మూసీలో శాశ్వత నివాసదారుల విషయంలో ప్రభుత్వం మానవతా దృక్పథంతో వ్యవహరిస్తుంది. వారికి డబుల్ బెడ్రూం ఇళ్లు ఇస్తాం.నివాసితులైన 11 వేల మందిలో ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం పునరావాసం కల్పిస్తుంది'

## బీఆర్ఎస్, కాంగ్రెస్ మాటల యుద్ధం

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడటం మంచి పద్ధతి కాదని, రాష్ట్ర ఉద్యమంలో అగ్రభాగాన పోరాడింది మహిళలేనన్నారు. మరోసారి చీరలు గాజులు చూపిస్తే కౌశిక్ రెడ్డి చెప్పు దెబ్బలు తినాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇక పాడి కౌశిక్ రెడ్డి మీద చర్యలు తీసుకో వాలని.. ఆయనపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని చెప్పారు. కౌశిక్ రెడ్డి వాఖ్య లను సుమోటోగా తీసుకుని మహిళా కమిషన్.. విచారణకు పిలవాలని పేర్కొన్నారు.

## నాగార్జున సాగర్ గేట్లు మూసివేత

బలగం టీవీ, హైదరాబాద్



నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ లో గణనీయంగా ఇన్ ఫ్లో తగ్గడంతో అధికారులు 26 క్రస్ట్ గేట్లను మూసివేశారు. బుధవారం మధ్యాహ్నం నాటికి ఎగువ ప్రాంతం నుంచి ప్రాజెక్టులోకి 43,068 క్యూసెక్కుల నీరు వస్తోంది. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 590 అడుగుల కు గాను ప్రస్తుతం ప్రాజెక్టులో 589 అడుగులకు చేరింది. వివిధ అవసరాల నిమిత్తం ప్రాజెక్టులోకి ఇన్ ఫ్లో గా వస్తున్న నీటిని అంతే మొత్తంలో అధికారులు బయటకు వదిలిపెడుతున్నారు. రైట్ కెనాల్ నుంచి 9,104 క్యూసెక్కులు, ఎడమ కాలు నుంచి 2210 క్యూసెక్కులు, పవర్ హౌస్ నుంచి 29,354 క్యూసెక్కులు, ఏ ఎం ఆర్పీ నుంచి 1800 క్యూసెక్కులు, ఎల్ ఎల్ సి నుంచి 600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

## పాకిస్థాన్‌లో భూకంపం..

బలగం టీవీ, హైదరాబాద్

పాకిస్థాన్‌లో భూకంపం సంభవించింది. బుధవారం మధ్యాహ్నం 12:58 గంటల సమయంలో 5.8 తీవ్రతతో భూమి కంపించింది. పెషావర్, ఇస్లామాబాద్, లాహెూర్‌లో కూడా ప్రకంపనలు నమోదయ్యాయి. భూకంపం కేంద్రం పాకిస్థాన్‌లోని కరోర్‌కు నైరుతి దిశలో 25 కిలోమీటర్ల దూరంలో భూమికి 10 కిలోమీటర్ల లోతులో గుర్తించినట్లు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ వెల్లడించింది. ఈ భూకంపం ధాటికి ఉత్తర భారతదేశంలోనూ ప్రకంపనలు చోటు చేసుకున్నట్లు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ తెలిపింది. రాజధాని ఢిల్లీ–ఎన్సీఆర్ ప్రాంతం , ఉత్తరప్రదేశ్, హర్యానా, రాజస్థాన్, పంజాబ్, జమ్మూ కశ్మీర్‌లోనూ భూమి కంపించినట్లు పేర్కొంది. అటు ఆఫ్ఘనిస్థాన్‌లోనూ భూమి కంపించినట్లు నేషనల్ మీడియా వెల్లడించింది.

## ఆడపిల్లలను కిడ్నాప్ చేశారంటూ వాట్సాప్ కాల్స్.. జాగ్రత్తగా ఉండాలన్న వీసీ సజ్జనార్

బలగం టీవీ, హైదరాబాద్

స్కూల్స్, కాలేజీలకు వెళ్లే అమ్మాయిలను కిడ్నాప్ చేశారంటూ తల్లిదండ్రులకు పోలీసుల పేరుతో సైబర్ నేరగాళ్లు వాట్సాప్ కాల్స్ చేసి బెదిరింపులకు దిగుతున్నారని ఆర్టీసీ ఎండీ సజ్జనార్ తెలిపారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా ఆయన ట్వీట్ చేశారు. నేరగాళ్లు అడిగినంత డబ్బు ఇవ్వకుంటే ఆడపిల్లలను కిడ్నాపర్లు చంపేస్తారంటూ భయభ్రాంతులకు చేస్తున్నారన్నారు. తాజా హైదరాబాద్ రాయదుర్గంలో ఓ విద్యార్థిని తల్లిదం డ్రులకు విదేశీ ఫోన్ నంబర్‌తో సైబర్ నేరగాళ్లు వాట్సాప్ కాల్ చేశారు. తాను పోలీస్ ఆఫీసర్‌ని మాట్లాడుతున్నానని.. కాలేజీకి వెళ్లిన అమ్మాయి కిడ్నాప్‌నకు గురైంది. ఆమె ప్రస్తుతం మాదగ్గరే ఉందని.. వెంటనే మేం అడిగినంత డబ్బును ఆన్‌లైన్ ద్వారా పంపించాలని.. లేకుంటే మీ అమ్మాయిని కిడ్నాపర్లు చంపేస్తామని బెదిరించారని.. ఇదిగో మీ అమ్మాయి ఏడుస్తుందంటూ ఒక వాయిస్‌ని వినిపించారన్నారు. దాంతో తమ కూతురు కిడ్నాప్‌నకు గురైందని తల్లిదండ్రులు భావించారని.. డబ్బులు పంపించేందుకు సిద్ధపడ్డారన్నారు. మోసగాళ్లతో ఫోన్‌లో మాట్లాడుతూనే తమ బంధువులకు ఈ విషయాన్ని చేరశారని.. తమ కూతురు కాలేజీలో ఉందో.. లేదో తెలుసుకోవాలని కోరారని పంపారన్నారు. ఆమె కాలేజీలో క్షేమంగా ఉందని చెప్పడంతో ఊపిరిపీల్చుకున్నారన్నారు. వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌కి వెళ్లి ఫిర్యాదు చేశారని.. అనంతరం తన దృష్టికి ఈ విషయాన్ని తీసుకువచ్చారన్నారు. ఈ తరహా బెదిరింపు ఫోన్ కాల్స్ తెలుగు రాష్ట్రాల్లో ఎక్కువగా వస్తున్నాయని.. అజ్ఞాత వ్యక్తుల నుంచి విదేశీ ఫోన్ నంబర్లతో వచ్చే వాట్సాప్ కాల్స్‌కు స్పందించొద్దని.. బెదిరింపులకు జంకకుండా స్థానిక పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేయాలన్నారు.

# పోలీస్ అధికారుల,సిబ్బంది సంక్షేమనికి అధిక ప్రాధాన్యత...

- సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు రావడం అభినందనీయం...
- ఒక్క సీసీ కెమెరా 100 పోలీసులతో సమానం.
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్.



**బలగం టీవీ , వేములవాడ**

గతంతో పోల్చుకుంటే ప్రస్తుతం ఉన్న పోలీసింగ్ లో విప్లవాత్మక మార్పులు వచ్చాయని, ప్రస్తుతం పోలీసు శాఖలో అత్యాధునిక సాంకేతికత పరిజ్ఞానం అందిపుచ్చుకొని నేరాల నియంత్రణలో ముందుకు సాగుతున్నారని ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ అన్నారు.బుధవారం వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్లో పునరుద్ధరించిన పోలీస్ గెస్ట్ హౌస్,మహాలక్ష్మి విధి నుండి కేజీవిబి వరకు ఏర్పాటు చేసిన 16 సీసీ కెమెరాలు లను ఎస్పీ అఖిల్ మహాజన్ తో కలసి ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ ప్రారంభించారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు వచ్చి 16 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన తోట రాజును అభినందించిన ఎస్పీ,ప్రభుత్వ విప్ అభినందించారు.

ఈ సందర్భంగా విప్ అది శ్రీనివాస్ మాట్లాడుతూ పోలీస్ శాఖ ద్వార జిల్లాలో శాంతి భద్రతలను కాపాడుతూనే, యువత ను సన్మార్గంలో నడిపించుటకు ఎస్పీ అఖిల్ మహాజన్ ఆధ్వర్యంలో విన్నూత కార్యక్రమాలు చేపడుతు ముందుకు సాగడం అభినందనియం అని అన్నారు. వేములవాడ పట్టణ పరిధిలో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలని,ఒక్క సీసీ కెమెరా 100 మందికి పోలీస్ లతో సమానమని,నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకం అన్నారు.

దక్షిణకాశీగా పేరుగాంచిన శ్రీ రాజరాజేశ్వర దేవాలయనికి వివిధ ప్రాంతాల నుండి వచ్చే భక్తుల రద్దీ నేపథ్యంలో వారి భద్రత దృష్టిలో ఉంచుకొని వేములవాడ పట్టణంలో మోడ్రన్ పోలీస్ స్టేషన్ మరియు అదనపు సిబ్బంది కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకవేళ్లడం జరిగిందని,అదేవిధంగా వేములవాడ పట్టణ పరిధిలో పెరిన ట్రాఫిక్ దృష్టిలో ఉంచుకొని త్వరలో ట్రాఫిక్ సిగ్నల్స్ అందుబాటులోకి తీసుకరవడం జరుగుతుందన్నారు.

జిల్లా ప్రజలకు సత్వర సేవలు అందించడానికి జిల్లా కేంద్రంలో నిర్మించిన జిల్లా పోలీస్ కార్యాలయం త్వరలో నే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించడం జరుగుతుందన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రాన్ని గంజాయి రహిత రాష్ట్రంగా మార్చడానికి నిక్కచ్చిగా ఉందని ఇప్పటికే జిల్లాలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో విన్నూత కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల్లో అవగాహన కల్పిస్తుందని, గంజాయి కి అలవాటు పడిన వారిని సన్మార్గంలో నడిపించేందుకు జిల్లా కేద్రంలో డి ఆడిక్షన్ సెంటర్ ఏర్పాటు చేయడం జరిగిందని,గ్రామాల్లో ఉన్న యువత తో మమేకం అవుతూ చెడు మార్గాలవైపు వెళ్లకుండా ఆవాహన కల్పించాలన్నారు. గతంలో జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళ ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరిగిందని,అంతే కాక ప్రతి నెల మండల స్థాయిలో జాబ్ మేళలు ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు.

ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ శాంతి భద్రతల పర్యవేక్షణలో 24/7 విధులు నిర్వహించే సిబ్బందికి విశ్రాంతి ఎంతో అవసరం అని దానికి అనుగుణంగా వేములవాడ పట్టణ పరిధిలో సిబ్బంది కోసం విశ్రాంతి గదులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.పోలీస్ సిబ్బందికి ఆరోగ్యం,సంక్షేమాం విషయంలో అధిక ప్రాధాన్యత ఇస్తున్న క్రమంలో సిబ్బంది మరింత సమర్ధవంతంగా విధులు నిర్వహించగలరన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, సిఐ లు వీరప్రసాద్, శ్రీనివాస్, ఎస్ఐ లు మారుతి, రమేష్, అంజయ్య,ప్రజాప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.



# కోచింగ్ సెంటర్స్‌ను కంట్రోల్‌లో పెడతాం..



- మంత్రి శ్రీధర్ బాబు

**బలగం టీవీ , హైదరాబాద్**

పోటీ పరీక్షల కోచింగ్ సెంటర్లు, నీట్, ఎంసెట్‌లాంటి ప్రవేశ పరీక్షలకు శిక్షణనిచ్చే సంస్థలపై కేంద్ర ప్రభుత్వం రూపొందించిన మార్గదర్శకాలను రాష్ట్రంలో అమలు చేస్తామని ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. కోచింగ్ సెంటర్లపై ఎలాంటి నియంత్రణ లేకపోవడంతో అభ్యర్థుల భద్రత, ఫీజుల భారంపై ఇప్పటి దాకా ఎలాంటి చర్యలు తీసుకోలేకపోయామని తెలిపారు. విద్యారంగ సంస్కరణలపై బుధవారం సచివాలయంలో అధ్యక్షతన జరిగిన కేబినెట్ సబ్ కమిటీ సమావేశంలో పలు అంశాలపై ఉన్నతాధికారులకు ఆయన మార్గదర్శకం చేశారు. సమావేశంలో సబ్ కమిటీ సభ్యురాలు పంచాయతీరాజ్, మహిళా, శిశు సంక్షేమశాఖల మంత్రి ధనసరి అనసూయ పాల్గొన్నారు.

ఇంజినీరింగ్, మెడిసిన్ ప్రవేశ పరీక్షలకు కోచింగ్ నిర్వహిస్తున్న కొన్ని సంస్థలు నిబంధనలకు విరుద్ధంగా జూనియర్ కాలేజీలను నడుపుతున్న విషయం తన దృష్టికి వచ్చిందని శ్రీధర్ బాబు తెలిపారు. కోచింగ్ సెంటర్ల నియంత్రణపై కేంద్రం గైడ్‌లైన్స్‌ని అమలు చేసి వీటిని కట్టడి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ప్రైవేట్ స్కూల్స్, ఇంటర్మీడియట్ కళాశాల ఫీజుల నిర్ధారణపై నియంత్రణ కమిటీ ఏర్పాటే చేసే విషయాన్ని పరిశీలిస్తున్నట్లు శ్రీధర్‌బాబు వెల్లడించారు. ప్రభుత్వ స్కూల్స్‌ను ప్రతిభా కేంద్రాలుగా తీర్చిదిద్దగలిగితే పేద విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లాల్సిన అవసరం ఉండదని మంత్రి పేర్కొన్నారు. అప్పర్ ప్రైమరీ, హైస్కూల్స్‌ను వేర్వేరుగా నడపడంతో మానవ వనరుల వృథా జరుగుతోందని రెండింటిని విలీనం చేసే అంశంపై అధ్యయనం చేసి నివేదిక అందించాలని విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశాన్ని ఆదేశించారు.

విద్యార్థులు లేని 1,600 పాఠశాలల్లోని ఉపాధ్యాయులను ఇతర స్కూల్స్‌ను బదిలీ చేయాలని సూచించారు. డిగ్రీ కళాశాలల్లో బీఏ కోర్సుల పాఠ్య ప్రణాళికలో మార్పులు చేసి విద్యార్థులను ఉద్యోగాలకు సంసిద్ధం చేసేలా శిక్షణ ఇవ్వాలన్నారు. రాష్ట్రంలోని తొమ్మిది పాలిటెక్నిక్ కాలేజీలను ఇంజినీరింగ్ కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేసే పనులను వేగవంతం చేయాలని చెప్పారు. మాసబ్ ట్యాంక్, రామంతాపూర్, వరంగల్, నిజామాబాద్, మహబూబ్‌నగర్, నల్గొండ, కొత్తగూడెం, సికింద్రాబాద్, కులీకుతుబ్ షా పాలిటెక్నిక్ కాలేజీల్లో ఇంజినీరింగ్ కాలేజీలను ప్రారంభిస్తామని తెలిపారు. విద్యాప్రమాణాల్లో రాష్ట్రం 34వ స్థానంలో ఉండడం ఆందోళన కలిగిస్తోందని అన్నారు. రెండేళ్లలో ఈ దుస్థితి నుంచి బయటపడాలని విద్యాశాఖ ఉన్నతాధికారులకు సూచించారు. అన్ని పాఠశాలలు, కాలేజీల్లో డిజిటల్ క్లాస్ రూములను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

ప్రైవేట్ స్కూల్స్‌ని ఈ దిశలో ముందడుగు వేసేలా చూడాలని తెలిపారు. డిగ్రీ కాలేజీల్లోని పబ్లిక్ పాలసీ విద్యార్థులను ఏడాది పాటు ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీల వద్ద ఇంటర్నీలుగా పనిచేసే అవకాశం కల్పిస్తామని వెల్లడించారు. దాంతో వారికి ప్రభుత్వ పాలనపై అవగాహన కలుగుతుందని తెలిపారు. విద్యా వ్యవస్థలో కృత్రిమ మేథను వినియోగించాలని కోరారు. పాలిటెక్నిక్, ఐటీఐ కోర్సులు చదివే విద్యార్థులకు పరిశ్రమల్లో ఆన్ హ్యాండ్ శిక్షణనిస్తే వారికి వెంటనే ఉద్యోగాలు దొరుకుతాయని అభిప్రాయపడ్డారు. విద్యార్థుల వినూత్న ఆలోచనలు, సృజనను బయటకు తెచ్చేలా ప్రతి కళాశాల డిజిటల్ మ్యాగజైన్‌లను నడపాలని సూచించారు. బీకాం, బీబీఏ, ఎంబీఏ విద్యార్థులకు బీఎఫ్ఐసీ సంస్థల్లో శిక్షణ ఇప్పించాలని తమ ప్రభుత్వం నిర్ణయించిందని వెల్లడించారు. ట్రిపుల్ ఐటీల్లో బయో సైన్సెస్, ఫార్మా కోర్సులను వచ్చే ఏడాది నుంచే ప్రవేశ పెట్టేలా పాఠ్యాంశాలు రూపొందించాలని ఆదేశించారు.



## ఐఐటీ గువాహటి డీన్ రాజీనామా

**బలగం టీవీ , గువహటి**

ఐఐటీ గువాహటి అకడమిక్ అఫైర్స్ డీన్ కేవీ కృష్ణ రాజీనామా చేశారు. కంప్యూటర్ సైన్స్ మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థి తన హాస్టల్ గదిలో సోమవారం ఉరివేసుకుని కనిపించడంతో విద్యార్థులు పెద్ద ఎత్తున నిరసనకు దిగారు. విద్యార్థికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నట్లు కొందరు చెప్తున్నారు. ఈ నేపథ్యంలో కృష్ణ తన పదవికి రాజీనామా చేశారు. విద్యార్థులు సోమవారం నుంచి నిరసన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఇటువంటి సంఘటనలు పదే పదే జరుగుతున్నాయని, ఇప్పటి వరకు ఈ క్యాంపస్‌లో నలుగురు విద్యార్థులు మరణించారని కొందరు చెప్పారు.

## జమ్ముకశ్మీర్ ప్రజలకు
# కాంగ్రెస్ ఐదు గ్యారెంటీలు



**బలగం టీవీ , శ్రీనగర్**

జమ్ముకశ్మీర్ ఎన్నికల వేళ అక్కడి ప్రజలపై కాంగ్రెస్ పార్టీ హామీల వర్షం కురిపించింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే అమలు చేయబోయే ఐదు సంక్షేమ పథకాల వివరాలను కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వెల్లడించారు. దక్షిణకశ్మీర్‌లో జరిగిన ఎన్నికల ప్రచారంలో పాలొన్న ఆయన ఈ మేరకు ఐదు గ్యారెంటీలను ప్రకటించారు.

**మహిళా పారిశ్రామికవేత్తలకు ఐదు లక్షల వడ్డీ లేని రుణం.**
**ప్రతి కుటుంబానికి రూ. 25 లక్షల ఆరోగ్య బీమా**
**ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రతి వ్యక్తికి 11 కిలోల ధాన్యం**
**కశ్మీర్ పండిట్ వలసదారులకు పునరావాసం**
**కుటుంబంలో మహిళా పెద్దకు నెలకు రూ.3,000**

ఐదు గ్యారెంటీల ప్రకటన నేపథ్యంలో బీజేపీ ప్రభుత్వంపై ఖర్గే మండిపడ్డారు. బీజేపీ చాలా మాట్లాడుతుందని, చర్యలు తీసుకునే విషయం వచ్చేసరికి ఏం ఉండదని ఎద్దేవా చేశారు. బీజేపీ ఎంత ప్రయత్నించినా, కాంగ్రెస్- ఎన్‌సీ కూటమి బలహీనపడదని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఈ విషయం స్పష్టమైందని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో సైతం అదే స్ఫూర్తితో ముందుకు సాగుతామని అన్నారు.

బీజేపీ ప్రభుత్వం ఐదు లక్షల ఉద్యోగాలు ఇస్తుందనేది అబద్ధం అని ఆరోపించారు. గతంలో రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని మోసం చేసిన వాళ్లు, ఇప్పుడు ఐదు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందని తెలిపారు. వాగ్దానం చేసిన పదేళ్లలో జమ్ముకశ్మీర్?లో లక్ష మందిని రిక్రూట్ చేసుకోలేనివారు, ఐదు లక్షల ఉద్యోగాలు ఎలా ఇస్తారని మండిపడ్డారు. ఇక్కడి ప్రజల తరఫున స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి కాంగ్రెస్, ఎన్?సీ పార్టీలు పోరాడుతుందన్నాయని తెలిపారు. అలాంటి పార్టీలను దృష్టిలో పెట్టుకొని ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు.

# కాంగ్రెస్‌వి చీల్చే రాజకీయాలు

- కేంద్ర హెూంమంత్రి అమిత్ షా



**బలగం టీవీ , న్యూఢిల్లీ**

కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై బీజేపీ నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కేంద్ర హెూంమంత్రి అమిత్ షా ఆయనపై మండిపడ్డారు. : జాతి వ్యతిరేక మాటలు మాట్లాడటం, దేశాన్ని ముక్కలుగా చేసే శక్తులకు మద్దతివ్వడం కాంగ్రెస్‌కు, రాహుల్‌గాంధీకి అభిరుచిగా తయారైందని కేంద్ర హెూంమంత్రి అమిత్‌షా ఆరోపించారు. ఇటీవల అమెరికా పర్యటనలో భాగంగా రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై అమిత్ షా ఈ మేరకు ఎక్స్ వేదికగా ఆగ్రహం వ్యక్తం చేశారు.

'దేశ వ్యతిరేక ప్రకటనలు చేయడం, దేశాన్ని విచ్ఛిన్నం చేసే శక్తులకు అండగా నిలవడం రాహుల్, కాంగ్రెస్‌కు అలవాటుగా మారింది. జమ్ముకశ్మీర్‌లో నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ చేస్తున్న దేశవ్యతిరేక, రిజర్వేషన్ వ్యతిరేక ఎజెండాలకు మద్దతిచ్చినా, విదేశీ గడ్డపై భారత్ వ్యతిరేక ప్రకటనలైనా సరే, ఆయన దేశభద్రత, ప్రజల మనోభావాలను దెబ్బతీస్తునే ఉన్నారు. ప్రాంతీయత, మతం, భాషల ఆధారంగా దేశాన్ని చీల్చే కాంగ్రెస్ రాజకీయాలను రాహుల్‌గాంధీ ప్రకటన బయటపెట్టింది. రిజర్వేషన్ల రద్దు గురించి మాట్లాడం ద్వారా వాటిపై కాంగ్రెస్ వ్యతిరేకతను మరోసారి మనముందుంచారు. ఆయన మనసులో మెదిలే ఆలోచనలే చివరకు మాటల రూపంలో బయటపడ్డాయి. ఇక్కడ నేను రాహుల్‌కు ఒక విషయం స్పష్టంచేయాలని అనుకుంటున్నాను. బీజేపీ ఉన్నంతకాలం రిజర్వేషన్లను ఎవరూ రద్దు చేయలేరు. అలాగే దేశభద్రతతో చెలగాటమాడలేరు' అని అమిత్ షా తీవ్ర వ్యాఖ్యలు చేశారు.



## ఏరో స్పైక్ రాకెట్ ఇంజిన్ ప్రయోగం విజయవంతం

**బలగం టీవీ , బెంగళూరు**

భారత తొలి ఏరో స్పైక్ రాకెట్ ఇంజిన్ ప్రయోగం విజయవంతమైంది. కర్ణాటకలోని చిత్రదుర్గ జిల్లాలో ఉన్న ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్ ప్రొపల్షన్ టెస్ట్ ఫెసిలిటీలో ఈ ప్రయోగాన్ని స్పేస్‌ఫీల్డ్స్ స్టార్టప్ విజయవంతంగా పరీక్షించింది. తొలుత అసాధారణ స్థితిలో ఉన్న ఇంజిన్ క్రమంగా స్థిరత్వాన్ని సాధించిందని శాస్త్రవేత్తలు వెల్లడించారు. ఈ ఇంజిన్ కోసం స్పేస్‌ఫీల్డ్స్ టైటానియం గ్రేడ్5ని వినియోగించింది. ఈ ప్రయోగ విజయం భారత అంతరిక్ష సాంకేతికతలో ముఖ్య ఘట్టంగా శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. స్పేస్‌ఫీల్డ్స్ లీడర్‌గా నిలుస్తుందని, ఏరోస్పైక్ ఇంజిన్‌తో సామర్థ్యం మెరుగుపడటమే కాకుండా, తక్కువ ఖర్చుతో కూడుకొన్నదని పేర్కొన్నారు.

## కేజ్రీవాల్‌కు జ్యుడీషియల్ కస్టడీ పొడిగింపు



**బలగం టీవీ , న్యూఢిల్లీ**

ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో అర్వింద్ కేజ్రీవాల్‌కు మళ్లీ నిరాశే ఎదురైంది. ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు ఆయన జ్యుడీషియల్ కస్టడీని మరోసారి పొడిగించింది. ఈ నెల 25 వరకు కేజ్రీవాల్ కస్టడీని పొడిగిస్తున్నట్లు రౌస్ అవెన్యూ కోర్టు స్పష్టం చేసింది. గతంలో విధించిన జ్యుడీషియల్ కస్టడీ గడువు బుధవారం ముగియడంతో మళ్లీ పొడిగించింది.

తీహార్ జైలు అధికారులు కేజ్రీవాల్‌ను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రౌస్ అవెన్యూ కోర్టులో హాజరుపర్చారు. కోర్టులోని స్పెషల్ జడ్జి కావేరీ బవేజా ముందు కేజ్రీవాల్ హాజరయ్యారు. ఢిల్లీ ఎక్సైజ్ పాలసీని రూపొందించి అమలు చేయడం ద్వారా కేజ్రీవాల్ నేరపూరిత కుట్రలో భాగస్వామి అయ్యారని సీబీఐ తన తాజా చార్జిషీట్‌లో ఆరోపించింది. 2021 మార్చిలో మాజీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా నేతృత్వంలో పాలసీని రూపొందించారని, దానికి కేజ్రీవాల్ మద్దతు ఉందని సీబీఐ పేర్కొంది. అయితే సీబీఐ వాదనలను ఆమ్ ఆద్మీ పార్టీ ఒక ప్రకటన ద్వారా ఖండించింది. లిక్కర్ స్కామ్ నిజమే అయితే నిందితుల నుంచి ఇప్పటి వరకు ఒక్క పైసా కూడా ఎందుకు రికవరీ చేయలేదని ప్రశ్నించింది. 500 మంది సాక్ష్యులను విచారించి, 50 వేల పేజీల పత్రాలను దాఖలు చేసినప్పటికీ ఒక్క ఆప్ నాయకుడు కూడా అవినీతి చేసినట్లు నిరూపణ కాలేదని పేర్కొంది. కాగా, ఇదే కేసులో ఆప్ ఎమ్మెల్యే దుర్గేష్ పాఠక్‌కు సెప్టెంబర్ 11న బెయిల్ మంజూరైంది.

సీబీఐ దాఖలు చేసిన చార్జిషీట్‌ను పరిగణనలోకి తీసుకున్న కోర్టు కేజ్రీవాల్‌తోపాటు దుర్గేష్ పాఠక్‌కు సమన్లు పంపింది. ఈ సమన్లపై స్పందించిన ఎమ్మెల్యే ఇవాళ కోర్టు ముందు విచారణకు హాజరయ్యారు. అనంతరం ఆయనకు కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఢిల్లీ ఎక్సైజ్ పాలసీకి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో మార్చి 21న కేజ్రీవాల్‌ను ఈడీ అరెస్టు చేసింది. ఆ తర్వాత జూలైలో సీబీఐ ఆయనను అదుపులోకి తీసుకుంది. అయితే ఈడీ కేసులో సుప్రీంకోర్టు జూలై 12న కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. సీబీఐ కేసులో మాత్రం ఇంకా జైల్లోనే కొనసాగుతున్నారు. ఆగస్టు 27, సెప్టెంబర్ 3, సెప్టెంబర్ 11 వరకు ఆయనకు జ్యుడీషియల్ కస్టడీ గడువు పొడిగించారు. తాజాగా మరోసారి గడువు పొడగింపుతో కేజ్రీకి నిరాశే మిగిలింది. ఈ కేసులో ఇప్పటికే మనీశ్ సిసోడియా, కల్వకుంట్ల కవిత తదితరులు బెయిల్‌పై బయటకి వచ్చారు.



## ఎలక్ట్రానిక్ సెక్టార్‌లో భారత్ దూసుకుపోతోంది

- ప్రధాని మోడీ

**బలగం టీవీ , న్యూఢిల్లీ**


ఎలక్ట్రానిక్ సెక్టార్‌లో భారత్ దూసుకుపోతోందని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. 'సెమీకన్ ఇండియా 2024' కార్యక్రమంలో ప్రధాని మోడీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సెమీ కండక్టర్ల ఉత్పత్తి కోసం పలు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. భారత్‌లో మరిన్ని చిప్‌లు తయారు కావాలన్నారు. ఎలక్ట్రానిక్ సెక్టార్‌లో ప్రస్తుతం భారత్ 150 బిలియన్ డాలర్ల మైలురాయిని చేరుకుందని.. ఈ దశాబ్దం చివరి నాటికి 500 బిలియన్ డాలర్లు చేరుకోవడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. దీని కారణంగా దేశంలో దాదాపు 60 లక్షల మంది యువతకు ఉద్యోగాలు లభిస్తాయని ప్రధాని చెప్పారు.

## సీనియర్ సిటిజన్లకు కేంద్రం శుభవార్త

**బలగం టీవీ , న్యూఢిల్లీ**

సీనియర్ సిటిజన్ల కోసం కేంద్ర ప్రభుత్వం బుధవారం శుభవార్త చెప్పింది. 90 ఏళ్లు పైబడిన సీనియర్ సిటిజన్లకు 'ఆయుష్మాన్ భారత్ ప్రధాన్ మంత్రి జన్ ఆరోగ్య యోజన' కింద బీమా సౌకర్యం కల్పిస్తామని ప్రభుత్వం తెలిపింది. దాదాపు 4.5 కోట్ల కుటుంబాలు ఈ పథకం కిందకు వస్తాయని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. ఇందులో ఆరు కోట్ల మంది సీనియర్ సిటిజన్లు ఉన్నారు. ప్రధాన్ మంత్రి జన్ ఆరోగ్య యోజన కింద 70 ఏళ్లు అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న వృద్ధులకు ఆయుష్మాన్ భారత్ కొత్త కార్డులను జారీ చేయనున్నది.

ఈ పథకం కింద 70 ఏళ్లు, అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న సీనియర్ సిటిజన్లు.. ఇప్పటికే పథకం కింద ఉన్న కుటుంబాలకు చెందిన వారు సంవత్సరానికి రూ.5 లక్షల వరకు అదనపు బీమా రక్షణ పొందనున్నారు. ఈ అదనపు బీమా కవరేజ్ 70 ఏళ్లలోపు వారికి మాత్రం వర్తించదు. ఆయుష్మాన్ భారత్ ప్రపంచంలోనే అతిపెద్ద బీమా పథకం. దీని కింద ప్రస్తుతం 40శాతం మంది పేదలకు ఏటా 5లక్షల వరకు బీమా సౌకర్యం కల్పిస్తున్నారు. ఇప్పుడు ఈ పథకం 70 ఏళ్లు అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న పౌరులకు మాత్రమే వర్తిస్తుంది. కానీ, పేద రోగుల కవరేజీ కూడా రూ.10లక్షలకు పెరుగనున్నది.






## నీరవ్ మోదీ ఆస్తులను అటాచ్ చేసిన ఈడీ

**బలగం టీవీ , న్యూఢిల్లీ**

పరారీలో ఉన్న వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీకి చెందిన రూ.29.75 కోట్ల విలువైన తాజా ఆస్తులను మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద అటాచ్ చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ బుధవారం వెల్లడించింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద సందేహాస్పద ఆస్తులను అటాచ్ చేసేందుకు తాత్కాలిక ఉత్తర్వులు జారీ చేసినట్లు ఈడీ ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ ఆస్తులు బ్యాంకు డిపాజిట్లు, భూమి, భవనాల రూపంలో ఉన్న ఆస్తులను అటాచ్ చేసినట్లు పేర్కొంది. పంజాబ్ నేషనల్ బ్యాంక్ కేసును ఐదు సంవత్సరాలుగా రెండు బిలియన్ల మోసంపై ఏజెన్సీ విచారణ జరిపింది. ఇంతకు ముందు ఈడీ భారత్‌తో పాటు విదేశాల్లో ఉన్న నీరవ్ మోదీకి చెందిన రూ.2,596 కోట్ల విలువైన ఆస్తులను జప్తు చేసింది. నీరవ్ మోదీ ప్రస్తుతం యూకే జైలులో ఉన్నారు.

బ్యాంక్ రుణాల ఎగవేతకు సంబంధించిన మోసం కేసుకు సంబంధించి భారత్‌కు అప్పగించడాన్ని వ్యతిరేకిస్తూ ఆయన అభ్యర్థనను తిరస్కరించింది. ఈ కేసులో సీబీఐ విచారిస్తున్నది. ఈ కేసులో ప్రధాన నిందితుడు నీరవ్, అతని మామ మెహుల్ చోక్సీ.. ముంబయిలోని పంజాబ్ నేషనల్ బ్యాంక్ (%పీఎన్‌బీ%) బ్రాడీ హౌస్ బ్రాంచ్‌లో బ్యాంక్ అధికారులతో కలిసి మోసానికి పాల్పడ్డారని.. నకిలీ హామీ లేఖలను జారీ చేశారని ఆరోపించారు. ఈ కేసులో మనీలాండరింగ్ ఆరోపణలపై ఈడీ దర్యాప్తు చేస్తున్నది. 2019 డిసెంబర్‌లో నీరవ్‌ను ముంబయి పీఎంఎల్‌నే కోర్టు పరారీలో ఉన్న ఆర్థిక నేరస్థుడిగా ప్రకటించింది. అదే సంవత్సరం లండన్‌లో అరెస్టయ్యాడు. పరారీలో ఉన్న ఆర్థిక నేరగాళ్ల చట్టంలోని నిబంధనల ప్రకారం.. నీరవ్, అతని సహచరులకు చెందిన రూ.692.90 కోట్ల విలువైన చర, స్థిరాస్తులను జప్తు చేసినట్లు ఈడీ పేర్కొంది. రూ.1,052.42 కోట్ల విలువైన ఆస్తులను బాధిత బ్యాంకులు, పీఎన్‌బీ సంబంధిత గ్రూప్ బ్యాంకులకు విజయవంతంగా తిరిగి ఇచ్చామని చెప్పింది.

## ప్రభుత్వ పాఠశాలలో బీరు తాగిన విద్యార్థినులు

**బలగం టీవీ , న్యూఢిల్లీ**

ఓ ప్రభుత్వ పాఠశాలలోని తరగతి గదిలో విద్యార్థినులు తన స్నేహితురాలు పుట్టిన రోజు సందర్భంగా బీరు తాగిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. ఈ సంఘటన ఛత్తీస్ గఢ్ రాష్ట్రం బిలాస్ పుర్ జిల్లాలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం భట్ చౌరా గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో అమ్మాయిలు తరగతి గదిలో బీరు తాగుతున్నప్పుడు వీడియోలు, ఫొటోలు తీసుకున్నారు. అమ్మాయిలలో ఒకరు వీడియోలను, ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేయడంతో విద్యాశాఖ ఉన్నతాధికారులకు తెలిసింది. దీనిపై విచారణ చేయాలని త్రిసభ్య కమిటీని డిఇఒ టి ఆర్ సాహు ఏర్పాటు చేశారు. పాఠశాలలో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు వెల్లడించారు. విచారణ కమిటీ సంబంధిత విద్యార్థులు, ఉపాధ్యాయులు నుంచి సమాచారం తీసుకొని దర్యాప్తు చేస్తుంది. ఖాళీ బీరు బాటిళ్లతో సరదాగా ఆడుకున్నామని, కానీ తాగలేదని విద్యార్థినులు కమిటీకి తెలియజేశారు. విద్యార్థుల తల్లిదండ్రులకు నోటీసులు పంపించామని, వివరణ కూడా కోరుతామని డీఈఒ తెలిపారు.

# మూడో రోజు ఆట రద్దు



**బలగం టీవి, న్యూఢిల్లీ**

న్యూజిలాండ్, ఆఫ్ఘనిస్తాన్ మధ్య జరగాల్సిన ఏకైక టెస్టు మ్యాచ్ మూడో రోజు కూడా ప్రారంభం కాలేదు. గ్రేటర్ నోయిడాలో జరగాల్సిన ఈ మ్యాచ్‌ను.. మంగళవారం రాత్రి వర్షం కురవడంతో.. బుధవారం మ్యాచ్ జరగలేదు. ఇప్పటి వరకు టాస్ కూడా పడలేదు. వర్షం లేకున్నా.. నోయిడా పిచ్ తడిగా ఉండడం ఇబ్బందికరంగా మారింది. ప్రస్తుతం ఇంత వరకు రెండు జట్లు వేదిక వద్దకు రాలేదు. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడం వల్ల.. గ్రేటర్ నోయిడా మైదానంలో తడి ఆరడం మరింత ఆలస్యం అవుతుందని కొన్ని వర్గాలు చెబుతున్నాయి. ఈ నెల 9 నుంచి 13 మధ్య నోయిడాలోని షాహిద్ విజయ్ సింగ్ పతీక్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ వేదికగా ఈ టెస్టు జరగాల్సి ఉంది. మైదానంలో సరిపోని కవర్లు లేకపోవడంతో.. వర్షం నుంచి గ్రౌండ్‌ను కాపాడుకోవడం కష్టంగా మారింది. అరుణ్ జైట్లీ స్టేడియం నుంచి క్యూరేటర్‌ను తీసుకొచ్చినా.. ఏ ఫలితం దక్కలేదు.కాన్పూర్ లేదా బెంగుళూరులో మ్యాచ్‌ను నిర్వహించుకునే అవకాశం కల్పించినా.. ఆఫ్ఘనిస్తాన్ ఆ అవకాశాన్ని వాడుకోలేకపోయింది.

# ఐసీసీ టెస్ట్ ర్యాంకింగ్స్ విడుదల

## టాప్-5లోకి రోహిత్ శర్మ

**బలగం టీవి, న్యూఢిల్లీ**

ఐసీసీ టెస్ట్ ర్యాంకింగ్స్‌లో టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ టాప్–5లో చోటు దక్కించుకున్నాడు. ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ బుధవారం టెస్ట్ ర్యాంకింగ్స్ విడుదల చేసింది. సెప్టెంబర్ 2021 తర్వాత తొలిసారి రోహిత్ టాప్–5లోకి చేరుకున్నాడు. టీమిండియా సీనియర్ ఆటగాడు విరాట్ కోహ్లీ, యశస్వి జైస్వాల్ ర్యాంకులు సైతం మెరుగయ్యాయి. జైస్వాల్ ఆరు, విరాట్ ఏడో ప్లేస్‌లో నిలిచారు. టీమిండియా త్వరలో బంగ్లాదేశ్‌లో టెస్ట్ సిరీస్ ఆడనున్నది. ఈ సిరీస్‌లో ఆటగాళ్లు రాణిస్తే ర్యాంకులు మరింత మెరుగయ్యే ఛాన్స్ ఉన్నది.


అలాగే ఈ ఏడాది ఇంగ్లండ్‌తో భారత్ ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ ఆడింది. రోహిత్ శర్మ, యశస్వి జైస్వాల్ బ్యాట్‌తో రాణించారు. ఇద్దరు అద్భుతమైన ఫామ్‌లో ఉన్నారు. యువ బ్యాటర్ జైస్వాల్ ఈ సిరీస్‌లో రెండు సెంచరీలు, మూడు హాఫ్ సెంచరీలు చేసి.. మొత్తం 712 పరుగులు చేశాడు. రోహిత్ శర్మ సైతం రెండు సెంచరీలతో రాణించి 400 పరుగులు చేశాడు. ఈ సిరీస్‌కు విరాట్ కోహ్లీ దూరమైన విషయం తెలిసిందే. తాజాగా ఐసీసీ ప్రకటించిన టెస్టు ర్యాంకింగ్స్ లోనూ శ్రీలంక బ్యాటర్లు మెరుగైన ర్యాంకులకు చేరారు. ఇంగ్లండ్‌తో జరిగిన సిరీస్‌లో ఓలీ పోప్ నేతృత్వంలోని జట్టును ఓడించిన విషయం తెలిసిందే

.ఇంగ్లండ్ ఆటగాడు జో రూట్ టెస్ట్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. అయితే, శ్రీలంకతో జరిగిన మూడో, చివరి టెస్ట్‌లో రెండుసార్లు విఫలం కావడంతో రేటింగ్ తగ్గింది. స్కోర్ 922 పాయింట్ల నుంచి 899 పాయింట్లకు పడిపోయింది. న్యూజిలాండ్ సీనియర్ ఆటగాడు కేన్ విలియమ్సన్ 859 రేటింగ్ పాయింట్లతో రెండోస్థానంలో కొనసాగుతున్నాడు. మూడోస్థానంలో న్యూజిలాండ్ క్రికెటర్ డారిల్ మిచెల్, నాలుగో స్థానంలో ఆస్ట్రేలియా ఆటగాడు స్టీవ్ స్మిత్ కొనసాగుతున్నారు. టాప్ 10లో పాక్ వికెట్ కీపర్, బ్యాట్స్‌మన్ మహ్మద్ రిజ్వాన్ తొమ్మిదో స్థానంలో నిలిచాడు.





# పీటీ ఉషపై వినేష్ ఫోగట్ సంచలన వ్యాఖ్యలు



**బలగం టీవి, న్యూఢిల్లీ**

ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్(ఐఓఏ) అధ్యక్షురాలు పీటీ ఉషపై భారత స్టార్ రెజ్లర్ వినేష్ ఫోగట్ సంచలన వ్యాఖ్యలు చేసారు. పారిస్ ఒలింపిక్స్ 2024లో భారత ఒలింపిక్ సంఘంతో పాటు పీటీ ఉష తనకు సాయం చేయలేదన్నారు. ఫొటోలు దిగుతూ సోషల్ మీడియా వేదికగా వాటిని షేర్ చేసుకొని మద్దతుగా నిలిచామని చెప్పుకున్నారని పేర్కొన్నారు.

పారిస్ ఒలింపిక్స్ 2024లో వినేష్ ఫోగట్‌పై అనర్హతవేటు పడిన విషయం తెలిసిందే. మహిళల 50 కేజీల ఫ్రీస్టైల్ రెజ్లింగ్ కేటగిరీలో అసాధారణ ప్రదర్శనతో ఫైనల్ చేరిన వినేష్ ఫోగట్.. 100 గ్రాముల అధిక బరువుతో డిస్ క్వాలిఫై అయ్యారు. దాంతో ఆమెకు ఏ పతకం రాలేదు. తనకు కనీసం రజత పతకమైనా ఇవ్వాలని వినేష్ ఫోగట్ కోర్టు ఆఫ్ ఆర్బిట్రేషన్ ఫర్ స్పోర్ట్స్(కాస్)ను సంప్రదించగా ప్రతికూల తీర్పే వచ్చింది.

అయితే ఈ కేసు విషయంలో భారత ఒలింపిక్ సంఘం నుంచి తనకు ఎలాంటి మద్దతు లభించలేదని తాజాగా వినేష్ ఫోగట్ అన్నారు. ఇటీవలే కాంగ్రెస్ పార్టీలో చేరిన ఆమె.. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ 'పీటీ ఉష మేడమ్ నన్ను చూడటానికి ఆసుపత్రికి వచ్చారు. ఒక ఫోటో తీసుకున్నారు. రాజకీయాల్లో ఇవన్నీ సహజమే. పారిస్ ఒలింపిక్ విలేజ్‌లో కూడా రాజకీయాలు నడిచాయి. అందుకే నా మనసు విరిగింది. రెజ్లింగ్‌ను వదిలేయవద్దని చాలా మంది నాకు చెబుతున్నా.. కొనసాగడం వల్ల నాకు జరిగే ప్రయోజనం ఏంది? అక్కడ ప్రతీది రాజకీయమే. ఆసుపత్రిలో ఉండగా ఓ వ్యక్తి వచ్చి నాతో ఫొటో దిగి నాకు అండగా ఉన్నానని ప్రచారం చేసుకోవడం సరైందేనా..? నిజానికి నాకు మద్దతు పలుకుతున్నట్లు నటించారు. మెడల్ కోసం నా తరఫున భారత ఒలింపిక్ అసోసియేషన్ పిటిషన్ వేయాలి. కానీ నాకు ఎవరూ అండగా లేకపోవడంతో నేను పోరాటం చేశాను. మేమంతా దేశం కోసం ప్రాతినిధ్యం వహిస్తున్నప్పుడు ప్రభుత్వం నుంచి పెద్ద ఎత్తున మద్దతు దక్కాల్సింది. కానీ, వారంతా మీడియాకు బైట్లు ఇచ్చే బిజీలో ఉండిపోయారు. దీంతో థర్డ్ పార్టీగానే మేం వాదనలు వినిపించాం.'అని వ్యాఖ్యానించారు.

## "35 చిన్న కథ కాదు"కు థియేటర్లు పెంపు

**బలగం టీవీ, హైదరాబాద్**


నివేత థామస్ అలాగే విశ్వదేవ్ రాచకొండ ప్రధాన పాత్రధారులుగా దర్శకుడు నందకిషోర్ తెరకెక్కించిన చిత్రం "35 చిన్న కథ కాదు".ఆడియెన్స్ మన్ననలతో పాటుగా విమర్శకుల ప్రశంసలు కూడా అందుకుంది.ఈ చిత్రం బాక్సాఫీస్ పరంగా కూడా డీసెంట్ రన్ తో వెళుతుండగా యూఎస్ మార్కెట్ లో సత్తా చాటుతుందని చెప్పాలి. అక్కడ ఈ చిత్రానికి డిమాండ్ నెలకొనడంతో మరిన్ని స్క్రీన్స్ ని పెంచినట్టుగా యూఎస్ డిస్ట్రిబ్యూటర్ వారు తెలిపారు. యూఎస్ మార్కెట్ లో ఈ చిత్రం 20కి పైగా కొత్త స్క్రీన్స్ ని యాడ్ చేసుకొని ప్రదర్శితం కానుంది. ఇది మాత్రం ఈ చిత్రానికి మరింత సక్సెస్ అని చెప్పాలి.



## నటి మలైకా అరోరా తండ్రి ఆత్మహత్య

**బలగం టీవి, ముంబై**

ముంబై : బాలీవుడ్ నటి మలైకా అరోరా తండ్రి అనిల్ అరోరా ఆత్మహత్య చేసుకున్నారు. ముంబైలోని బాంద్రాలో ఉన్న తన ఇంటి ఏడో అంతస్థు నుంచి ఆయన కిందకు దూకి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ మేరకు ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. మలైకా అరోరా మాజీ భర్త అర్బాజ్ ఖాన్, సీనియర్ పోలీసు అధికారులు అనిల్ అరోరా ఇంటికి చేరుకున్నారు. అతని మృతదేహాన్ని పోస్టుమార్టమ్ కోసం పంపించారు. ఆత్మహత్య కేసులో ముంబై పోలీసులు విచారణ చేపడుతున్నారు.




## 'రైడ్ 2' విడుదల తేదీ ఫిక్స్

**బలగం టీవీ, ముంబై**

బాలీవుడ్ నటుడు అజయ్ దేవగన్ ప్రధాన పాత్రలో వచ్చిన చిత్రం 'రైడ్'. ఇలియానా కథానాయికగా నటించగా.. సౌరభ్ శుక్లా, సానంద్ వర్మ కీలక పాత్రల్లో నటించారు. 2018లో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద మంచి హిట్ అందుకుంది. అయితే 6 సంవత్సరాల తరువాత బాలీవుడ్‌లో ఈ సినిమాకు సీక్వెల్ రాబోతున్నట్లు మేకర్స్ అనౌన్స్ చేశారు. సెకండ్ పార్ట్‌లో కూడా అజయ్ దేవగణ్ హీరోగా నటిస్తుండగా.. రితేష్ దేశ్‌ముఖ్, వాణి కపూర్ కీలక పాత్రల్లో కనిపించబోతున్నారు. తాజాగా ఈ సినిమా విడుదల తేదీని ప్రకటించారు. ఈ మూవీని ఫిబ్రవరి 21 2025 మహాశివరాత్రి కానుకగా ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు ప్రకటించారు. ఈ సినిమాకు రాజ్ కుమార్ దర్శకత్వం వహిస్తుండగా.. పనోరమా స్టూడియోస్ బ్యానర్‌పై భూషణ్ కుమార్, కుమార్ మంగత్ పాఠక్, అభిషేక్ పాఠక్, క్రిషన్ కుమార్ కలిసి సంయుక్తంగా నిర్మిస్తున్నారు.

## 'హనుమాన్' బాధ్యతను పెంచింది

**బలగం టీవి, హైదరాబాద్**



'హనుమాన్' రూ.100 కోట్లు మాత్రమే కలెక్ట్ చేసుంటే తాము ఆ మూవీ సీక్వెల్‌ను ఎప్పుడో విడుదల చేసేవాళ్లం. కానీ ఆ చిత్రం మా అంచనాలకు మించి కలెక్షన్లు సాధించింది. అందుకే మా బాధ్యత కూడా మరింత పెరిగింది అని తన దర్శకుడు ప్రశాంత్ వర్మ అన్నారు. హనుమాన్‌తో బ్లాక్‌బస్టర్ హిట్‌ను సాధించిన ప్రశాంత్ వర్మ ప్రస్తుతం ఆ మూవీ సీక్వెల్‌ను తెరకెక్కించే పనుల్లో ఉన్నారు. అయితే తాజాగా మరిన్ని సినిమాల గురించి ఓ ఆంగ్ల మీడియాతో జరిగిన ఇంటర్వ్యూలో పంచుకున్నారు. "పీవీసీయూ కోసం నేను కొంతమంది బాలీవుడ్ స్టార్స్‌ను సంప్రదించాను. వారందరితో నా ఐడియాలను షేర్ చేసుకున్నాను. వారు ఈ యూనివర్స్‌లో కచ్చితంగా భాగమవుతారు. అయితే దానికి కాస్త సమయం పడుతుంది. ఎందుకంటే ఈ సినిమాటిక్ యూనివర్స్ ఇంకా ప్రారంభ దశలోనే ఉంది. ఇక 'జై హనుమాన్' సినిమా పనులు శరవేగంగా జరుగు తున్నాయి. ఈ సినిమా కంటే ముందు 'అధీరా' అనే మరో సినిమాను రిలీజ్ చేయనున్నాము. దీంతో పాటు మరో రెండు సినిమాలకు కూడా పనిచేస్తున్నాం.

"జై హనుమాన్ కోసం ఎంతోమంది కష్టపడుతున్నారు. స్క్రిప్ట్ వర్క్ కూడా వేగంగా జరుగుతోంది. మీ అంచనాలను అందుకునేలా ఈ సినిమా ఉంటుంది. స్క్రీన్‌పై అభిమానులు ఏ అంశాలనైతే చూడాలనుకుంటున్నారో వాటిని మేము కచ్చితంగా చూపిస్తాం. ఇక ఈ సినిమాలో మెరిసే నటీనటుల ఎంపిక కూడా దాదాపు పూర్తయింది. ప్రతి ఏడాది కనీసం ఒకటి లేదా రెండు సినిమాలు విడుదల చేయాలనే లక్ష్యంతో పని చేస్తున్నాం" అని అన్నారు.



## హీరో జీవాకు తప్పిన పెను ప్రమాదం

**బలగం టీవి, చెన్నై**

తమిళ హీరో జీవాకు తృటిలో పెను ప్రమాదం తప్పింది. ఆయన ప్రయాణిస్తున్న కారు రోడ్డు ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో ఆయన ప్రాణాలతో బయటపడ్డారు. జీవా తన భార్యతో కలిసి చెన్నై నుంచి చిన్నసేలం వైపు కారులో ప్రయాణిస్తున్నారు. ఈ క్రమంలో కళ్లకురిచి జిల్లా కన్నియమూర్ వద్ద ఆయన ప్రయాణిస్తున్న కారు ప్రమాదానికి గురైంది. అడ్డుగా వచ్చిన బైక్‌ను తప్పించబోయే క్రమంలో ఆయన కారు బారికేడ్‌ను ఢీ కొట్టినట్లు తమిళ మీడియా పేర్కొంది. అదృష్టవశాత్తూ జీవా, ఆయన భార్య ఇద్దరూ ఈ ప్రమాదం నుంచి క్షేమంగా బయటపడ్డారు.